
ఆంధ్ర ప్రభ
సచిత్ర వారపత్రిక



# ఒంటరి శిలువ

గోపరాజు నాగేశ్వరరావు

**ప్రత్యేక కానుక - పుల్ అవుట్ నవలిక**



జీవితాన్ని కళాత్మకంగా నిర్మించుకుంటూ ... పట్టుపురుగు తన గూడు తాను అల్లుకుని ఆనందంగా అందులో కుదురుకున్నట్టు జీవితంలో కుదురుకున్నాడు రామ్మూర్తి. రెవిన్యూ శాఖలో సూపర్నెంటుగా పనిచేస్తూ ఆరు నెలల క్రితమే రిటైరయ్యాడు.

ప్రేమించి మరీ పెళ్లి చేసుకున్న భార్య; 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అనదగిన కొడుకూ, కోడలూ; ఈ మధ్యనే వాళ్లు అందించిన అందాల మనుమడూ; కంప్యూటర్ కోర్స్ చదువుతున్న పెళ్లికాని అమ్మాయీ; ఆరు గదుల సొంత ఇల్లూ; బాంకుల్లో బాలెన్సులూ .... అదీ రామ్మూర్తి!

ఉద్యోగ విరమణ చేసిన కొత్తల్లో తనకు అప్పుడే స్వాతంత్ర్యం వచ్చినట్టూ, స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నట్టూ అనిపించేది రామ్మూర్తికి. అంతవరకూ మరుగున పడిన సొంత జీవితం ఆవిష్కరించినట్లూ, అంతకుముందు తాను కాలం వెంట పరుగిడితే, కాలం ఇప్పుడు తన వెంట పరుగిడుతోందన్న భావన!

అనుకున్నప్పుడు నిద్రకు ఉపక్రమించేవాడు. విసుగనిపిస్తే అమాంతం మంచంమీంచి లేచి, తాపీగా ఓ గంట స్నానం చేసేవాడు. కోరిన దుస్తులు ధరించి సాయంకాలం వేళల్లో కోరిన వీధుల్లో సంచరించేవాడు. వేళకు ఇల్లు చేరి హాయిగా భోంచేసి విశ్రాంతిగా పడుకునేవాడు.

ఒక్క రిటైర్మెంటుతో జీవితం ఎంతగా మారిపోయిందీ! ఇప్పుడు అధికారుల గద్దింపులు లేవు. తన ఆత్మను చంపుకుని ఎవరి అహాన్నీ- సంతృప్తిపరచే అవసరం లేదు. పరిష్కరించాల్సిన ఫైళ్లు లేవు. గడియారం అంటే లక్ష్యం లేదు! జిల్లా కలెక్టరు నిజంగానే అతడికి తృణప్రాయం! ఇక ఆర్డీవో ఎంతా?

ఆ సాయంత్రం రామ్మూర్తికి ఉబుసుపోవటంలేదు. స్నానం చేశాడు. మంచి బట్టలు కట్టుకుని అందంగా ముస్తాబయ్యాడు. చెప్పుల్లో కాళ్లు దూరుస్తూ తల పైకి ఎత్తి భార్యకోసం చూశాడు.

ఆమె వంట గదిలో ఉన్నట్టుంది!

"ఏమోయ్, పారూ! నేనలా గాంధీపార్కు దాకా వెళ్లొస్తాను!" అని అక్కణ్నించే కేక వేసి చెప్పి గుమ్మంకేసి తిరిగాడు.

"ఏఁవండోయ్!" పిల్చింది వంట గదిలోంచే పార్వతమ్మ.

"ఏఁవిటీ?"

"మరేమీ లేదు, అసలే చలిగా ఉంది. సాయంత్రం ఆరుగంటలకే విపరీతంగా మంచు కురుస్తోంది. ఏ జలుబో పాడో పట్టుకుందంటే ఈ వయసులో మహాకష్టం! కొంచెం మఫ్లరన్నా తలమీద వేసుకుని వెళ్లండి!" అందావిడ వంటగదిలోంచే.

రామ్మూర్తి తటపటాయిస్తూ ఒక్క క్షణం ఆగాడు. తను ఉద్యోగంలో ఉన్నంతకాలం ఎప్పుడూ ఆమె వయసు ప్రస్తావనే ఎత్తలేదు. అలాంటిది ఇప్పుడు 'ఈ వయసులో ఏ జలుబో పాడో పట్టుకుంటే మహా కష్టం' అని ఎందుకు అన్నదబ్బా? అని ఆలోచించాడు.

'నువ్వు రిటైరయ్యావ్!' అని హెచ్చరించింది అంతరాత్మ. ఏదో సన్నటి ముల్లు గుచ్చుకుని మౌనంగా మూలిగాడు.

"నాపట్ల అంతటి శ్రద్ధే ఉంటే ఆ మఫ్లరేదో నువ్వే తెచ్చి ఇవ్వొచ్చుగా! వంట గదిలోంచే అలా కేకలు పెడతావేం?" అన్నాడు రామ్మూర్తి విసుగ్గా.

"నాది మాత్రం వచ్చే వయసా? నడుము పీక్కుపోతోంది. మోకాళ్లు తీపులు తీస్తున్నాయి. చేసినంతకాలం చేశాను. ఇక నా వల్ల కాదు, బాబూ!" అంది పార్వతమ్మ, ముక్తాయింపుగా దీర్ఘమైన మూలుగొకటి మూలుగుతూ.

రామ్మూర్తి విసవిసా బయటకు నడిచాడు.

***

వివిధ శాఖల్లో పనిచేసి రిటైరైన మాజీ ఉద్యోగులందరూ సాయంకాలం వేళల్లో గాంధీపార్కులో చేరుతుంటారు. జేబులు అనుమతించేదాన్నిబట్టి వేయించిన శనక్కాయలు కొనుక్కుని తింటూ ఒకళ్ల కష్టసుఖాలు ఒకళ్లు చెప్పుకుని ఋణశేషం లేకుండా ఓదార్చుకుంటూంటారు.

పార్కులో జరిగే వాళ్ల చర్చల్లో రోజూ వినిపించేవి, పిల్లలు సక్రమంగా

చూడటంలేదనీ; కోడలు నిర్లక్ష్యం చేస్తుంటే కనీసం కొడుకులైనా ఓదార్చకుండా, భార్యల కొంగులు పట్టుకుని తిరుగుతున్నారనీ; పెద్దలని గౌరవించే కాలం చెల్లిపోయి, కానికాలం దాపురించిందనీ ...

కొంచెం సేపటికి చర్చ మరోదారికి మళ్లీ, పెన్షన్ అందుకోవటంలో ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రభుత్వ విధానాలపట్ల అసంతృప్తి ప్రకటనలూ ... రెండో మూడో బూతు కూతలతో ఇక ఆ చర్చ కట్టిపెట్టి, ఆధ్యాత్మిక చింతనవేపుకి మనసులు మళ్లిస్తూంటారు.

జీవి పుట్టుక మొదలు గిట్టే దాకా చరిత్రను మధించి సత్యసారాన్ని పిండి చివరకు 'ప్రాణికోటికి మృత్యువు అనివార్యం!' అని తేలుస్తూంటారు.

దాంతో మనసులకు స్వస్థత చిక్కుతుంది. ఊరట పడుతుంది. వేడి నిట్టూర్పులు వినిపించవు. పుటంపడి నిర్మలమైనట్టు మెరుపు కళ్లతో కనిపిస్తారు. అమ్మేవాళ్ల బుట్టల్లో శనక్కాయలు అయిపోతాయి. వాళ్లు చిల్లర డబ్బులు లెక్క చూసుకుని ఖాళీ బుట్టలతో వెళ్లిపోతారు.

"టైమైంది, వెళ్లండి!" అని హెచ్చరిస్తాడు తోటమాలి.

తమతమ జీవితానుభవాలూ, కుటుంబం కోసం చేసిన అసమాన త్యాగాలూ ... అలాంటి తమ సుగుణాల వల్లనే ఇంకా భూమి తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుడి చుట్టూ తిరుగుతోందనీ; ఎవరు తమను లక్ష్యపెట్టకపోయినా గ్రహాలు కూడా ఆగ్రహించి గతులు తప్పుతాయనీ అన్నంతగా విశ్వసిస్తూ ఆనందంగా ఇళ్లకు వెళ్లిపోతారు.

ఆ ధైర్యం, ఆత్మాతిశయం, వాళ్లకు ఉండేది అందరూ కలిసి అలా పార్కులో కష్టసుఖాలు చెప్పుకుని ఒకళ్లనొకళ్లు ఓదార్చుకున్నంతవరకే! ఎవరి దారిన వాళ్లు ఇళ్లకు వెళ్లగానే నిజజీవితం కళ్లముందు నిల్చుంటుంది. తమ ప్రమేయం లేకుండానే ప్రపంచం సజావుగా సాగుతుంటుంది. తమ ఉనికి తమకోసమే తప్ప బ్రహ్మాండాన్ని బద్దలు చేసేదేమీ లేదనిపిస్తుంది.

పార్కులో ఉన్నప్పుడు గుండెల్లో కుదురుకునే ధైర్యం అంతలోనే ఆవిరై, ఇంకిపోతుంది. దైన్యం నిండిన కళ్లతో శూన్యంలోకి చూస్తూ, పగలంతా ఎలాగో గుండెలు చిక్కబట్టుకుని, సాయంకాలం వేళకల్లా మళ్లీ గాంధీ పార్కుకు ఆత్రంగా చేరుతూంటారు. కష్టసుఖాలు చెప్పుకుంటారు. ఒకళ్లకొకళ్లు ధైర్యం పంచుకుంటారు.

అప్పుడు మళ్లీ వాళ్లకు భవిష్యత్తుపట్ల ఎంతటి విశ్వాసం కుదురుతుందో, ఆ జీవన సంధ్యలో కూడా! అలా కలిగే ధైర్యానికి, విశ్వాసానికీ, కలిసి కష్టసుఖాలు పంచుకునే సుహృద్భావానికీ ధైర్యం ఇచ్చి పుచ్చుకునే సౌహార్ద్రతకూ కారణం వాళ్లందరిలోనూ పేరుకుపోయిన భయమే కామోసు!

రామ్మూర్తి తల వంచుకుని నెమ్మదిగా నడూస్తూ గాంధీ పార్కు వేపుకు వెళ్తున్నాడు. అలా నడుస్తుంటే నడుముల్లో సన్నగా నులి నొప్పి మొదలైంది. ఆయాసంగా కూడా ఉంది. దారివెంట వచ్చేపోయే వాహనాల శబ్దం సక్రమంగా వినిపించకుండా చెవులు రెండూ విధి నిర్వహణలో అలసిపోయినట్టు అనిపించింది రామ్మూర్తికి. చూపు బూజరగా ఉంది.

శారీరకంగా వస్తున్న మార్పును అప్పుడు గమనించాడతను. ఒక్క క్షణం రోడ్డు పక్కనే ఆగి, గుండెనిండా గాలి పీల్చి వదిలి మళ్లీ నడక సాగించాడు.

"హలో.... రామ్మూర్తిగారూ!" అన్న పిలుపు వినిపించింది దారిలో. ఆగి వెనక్కు తిరిగి చూశాడు. అలా తనను కేకవేసి పిల్చింది రిటైర్డ్ ఎస్సై వేణు.

వేణు పెద్దపెద్ద అడుగులు వేస్తూ దగ్గరికి వచ్చాడు. ముఖంనిండా అలా నవ్వులు చిందిస్తూ "మీరు గాంధీ పార్కుకేనా?" అడిగాడు.

"నమస్తే సార్! పార్కుకే వెళ్తున్నాను!" చెప్పాడు రామ్మూర్తి.

"పదండి, వెళ్దాం!" అని వేణు రామ్మూర్తి భుజంమీద చెయ్యి వేశాడు. ఇద్దరూ పార్కువేపుకి నడుస్తున్నారు.

"రామ్మూర్తిగారూ! కొంపదీసి మీకూ బి.పి., షుగరూలాంటివి లేవు కదా?" దారిలో ఏదో పరధ్యానంగానే అడిగాడు వేణు, రామ్మూర్తిని. అంతలోనే సభ్యత వెన్నుతట్టి హెచ్చరించింది కాబోలు "ఇలా అడిగానని అపార్థం చేసుకోకండి, రామ్మూర్తిగారూ! ఈ వయసులో మనుషులకు అవి సర్వసాధారణం! అలాంటివి వెంటపడితే జీవితం నరకప్రాయమే! పగవాడికి కూడా రాకూడదనిపిస్తాయి; కానీ వచ్చేవే అవి! ఏం చేస్తాం ...." అన్నాడు మళ్లీ.

బాధ, భయం, విచారం, దిగులూ ... అన్నింటినీ దాటి ఆవలి అంచులు తాకిన తాత్త్వికత ఏదో వేణు కంఠంలో జీరగా ధ్వనించింది.

తల పైకెత్తి అతడి ముఖంలోకి పరిశీలనగా చూశాడు రామ్మూర్తి. తెచ్చి పెట్టుకున్న గాంభీర్యమే తప్ప నిజానికి అతడి ముఖం చాలా దీనంగా ఉంది.

"అలా ఎందుకు అడిగారూ?" అంటూ ప్రశ్నార్థకంగా చూశాడు రామ్మూర్తి.

"అవ్వన్నీ నాకు ఉన్నాయి కనుక!" అని ఫెళ్లున నవ్వాడు వేణు. నవ్వటం పూర్తయ్యాక రామ్మూర్తి భుజంమీంచి చెయ్యి తీసి పాంటుజేబులో పెట్టుకుని నడుస్తూ

"రాత్రంతా ఒకటే దగ్గూ, ఆయాసం! నా పరిస్థితి చూసి మా ఆవిడ చాలా ఆందోళన పడింది. వీపుకూ, గుండెకూ అమృతాంజనం కూడా రాసింది. అప్పటికప్పుడు పాలు వెచ్చచేసి మిరియాల పొడి కలిపి ఇచ్చి తాగించింది! ...." అని వేణు ఇంకా ఏదో చెప్తుంటే రామ్మూర్తికి వినిపించలేదు. ధ్యాసంతా మరోవేపుకు మళ్లి భార్యమీద లగ్నమైంది.

పార్వతి ఇందాక కనీసం వంట గదిలోంచి కూడా కదల్లేదు. శ్రమలేని సానుభూతి చూపించింది కానీ మఫ్లర్ మాత్రం తెచ్చి ఇవ్వలేదు. మోనోపాజ్ దశలో అందరికీ సహజంగా ఉండే రుగ్మతలను సాకుగా చెప్పి, కాళ్ల తీపులనీ, నడుముల్లో నొప్పనీ గదిలోంచి కదల్లేదు.

పాపం ... వేణుగారి భార్య కూడా అదే స్థితిలో ఉండి ఉంటుంది! అయినా అంత శ్రద్ధగా అర్ధరాత్రివేళ భర్తకలా సేవలు చేసిందంటే ...

ఆమె పట్ల అపారమైన అభిమానం, గౌరవం కుదురుకున్నాయి అప్పటికప్పుడే రామ్మూర్తి మనసులో!

ఏదో లోకంలో విహరిస్తున్న రామ్మూర్తిని చేత్తో తట్టి పిల్చాడు వేణు.

"ఆఁ ... చెప్పండి! అర్ధరాత్రివేళ అంత హైరానా పడ్డారన్నమాట!" అన్నాడు రామ్మూర్తి కించిత్తు సానుభూతిగా.

"పడ్డాను. కానీ, ఆ దగ్గూ, ఆయాసంకన్నా ఎక్కువగా బాధనిపించింది ఏమిటో తెలుసా? మా ఆవిడ అంతా చేసి, చివరికి అంది కదా ... 'ఎలాగోలా మీరా దగ్గును తగ్గించుకోండి! ఖళ్లు ఖళ్లున దగ్గుతుంటే పక్క గదిలో ఉన్న అబ్బాయికీ, కోడలు పిల్లకూ ఎంత డిస్టర్బెన్సూ!' అని. అప్పుడు నాకు అనిపించింది. నా భార్య మైథిలికి నాపట్ల ప్రేమాభిమానాలు కొడగట్టిపోతున్నాయా? అని. ప్రయోజకుడైన కొడుకూ, మా ఇంటి బాధ్యతల పగ్గాలు పట్టుకున్న కోడలుపిల్లా మైథిలిని ఆకర్షించినంతగా ఇప్పుడు నేను ఆకర్షించలేకపోతున్నానా? అని కూడా అనిపించింది."

రామ్మూర్తి ఉలిక్కిపడ్డాడు. మైథిలిపట్ల మనసులో ఏర్పరుచుకున్న

ఆరాధ్యభావం గాలిబుడగలా ఫెటేల్మని పేలిపోగా జాలిగా అతనివేపు చూశాడు.

"మళ్లీ విజ్ఞత హెచ్చరించగా ఆమెకోణం నుంచి కూడా బాగా ఆలోచించానండీ, రామ్మూర్తిగారూ! మైథిలికి నాపట్ల ప్రేమ రవ్వంత కూడా తగ్గలేదు. జీవనసంధ్య కదా! బతుకుల్లో కమ్ముకోబోతున్న కారుచీకట్లకు భయపడి ఆమె తీసుకుంటున్న ముందు జాగ్రత్తే అలా కొడుకునీ, కోడలుపిల్లనీ అధికంగా అభిమానించటం! ఇప్పుడు ప్రయోజకుడైన 'కొడుకు' అనే దీపం ముందు భర్త అనే కొడిగడుతున్న దీపం ఇచ్చే వెలుతురు బహు స్వల్పం. అది కూడా ఏ క్షణంలో ఆరిపోతుందో!

"అయినా, మన భ్రమలే కానీ, రామ్మూర్తిగారూ! ట్రాష్! ఈ ప్రేమలూ, ఆప్యాయతలూ, అనుబంధాలూ అన్నీ ఎదుటివారికి బతుకు భద్రత చేకూర్చలేని క్షణంలో భళ్లున పగిలిపోయే భావావేశాలు మాత్రమే!

"మైథిలికి నాపట్ల ప్రేమ రవ్వంత కూడా తగ్గలేదని అన్నాను కదూ! ప్రేమ అంటే మరేం లేదు. ఎన్నో దశాబ్దాల మా ఇద్దరి సాహచర్యం వల్ల ఒకళ్లకొకళ్లం బాగా అలవాటయ్యాం. వట్టి కాళ్లతో నడిచేటప్పుడు తప్పకుండా గుర్తొచ్చేవి చెప్పులే! అంతమాత్రాన చెప్పులమీద ప్రేమకు మన జీవితం అంకితమైనట్టు కాదు కదా! ఇదీ అంతే.

"మరో దౌర్భాగ్యం ఏమిటంటే, వయోరీత్యా మనకు శారీరకంగా, మానసికంగా ఫాకల్టీస్ నశించిపోతున్నాయి. ఆ రెంటినీ అనుసంధానం చేసి ఏకకాలంలో అటు మనసుకూ, ఇటు భౌతిక శరీరానికీ ఉల్లాసం కలిగించే సెక్స్ కూడా అరుదైన మొక్కుబడిగా మారిపోయింది. ఇక రెండు శరీరాలనూ, రెండు మనసులనూ ఒద్దికగా ఒకచోట కుదిర్చే మాయాజాలం ఏం మిగిలింది కనుకా ...?

"కుటుంబానికి ఆర్థిక వనరులు అందిస్తూ సంపాదనపరుడుగా ఉన్నంతకాలం కుటుంబ యజమానిగా అందరి అవసరాలను తీరుస్తూ ప్రేమిస్తూ అందరి ప్రేమా పొందుతూ, గౌరవం పొందుతూ .... ఆ దశ దాటి ఉద్యోగ విరమణలోకీ, వృద్ధాప్యంలోకీ వెళ్లగానే ఆ ఇంటి పగ్గాలు ప్రయోజకుడైన కొడుకు చేతికి అందించేందుకే ఆత్రుత పడుతుంది తల్లి. అంతకాలం ఆ కుటుంబ సామ్రాజ్యాన్ని ఏలిన భర్తస్థానంలో కొడుకుని ప్రతిష్ఠింపచూస్తుంది. అందుకు ప్రతిఫలంగా బతుకు భద్రతను ఆశిస్తుంది. ఆ ప్రయత్నంలో అనివార్యంగా భర్తకు కూడా ఆవేదన కలిగిస్తుంది.

"రామ్మూర్తిగారూ! బలహీనమవుతున్నప్పుడూ, చుట్టూతా ప్రపంచం బలోపేతమవుతున్నప్పుడూ ఏదో ఒక అగ్రరాజ్యపు ఛత్రఛాయలో కుదురుకోవటం మినహా గత్యంతరం లేని స్థితి దేశాలకే అనివార్యమవుతున్నప్పుడు ... అల్పజీవులం, ఇక మనమెంత!

"ఆర్థికంగానూ కుటుంబంమీద అజమాయిషీ వచ్చిన కొడుకు, తండ్రిస్థానాన్ని ఆక్రమించినప్పుడు తల్లి భర్త ఆకర్షణ పరిధి నుంచి కొంచెం పక్కకు తొలగి కొడుకు నీడలో రక్షణ పొందాలని భావిస్తుంది. ఆ వెంపర్లాటలో తనకు కొడుకంటేనే అధిక ప్రేమ అని - కొడుకుని నమ్మించేందుకు తపనపడుతుంది. ఆ తపనలో భర్త మనసుకు తూట్లు పొడిచి, గాయాలు చేసేందుక్కూడా వెనుకాడదు. కానీ, విచిత్రం ఏమిటో తెలుసా, రామ్మూర్తిగారూ!" అంటూ వేణు రామ్మూర్తి ముఖంలోకి సూటిగా చూశాడు.

అప్పటికే రామ్మూర్తి మెదడులో పిల్లరాక్షసుల్లాంటి ఆలోచనలు అల్లరి చేస్తున్నాయి. అడిగినా కానీ, ఇందాక పార్వతి మఫ్లర్ తెచ్చి అందించలేదు. పురిటికి పుట్టింటికి వెళ్లిన కోడలు మగపిల్లవాడికి జన్మనిచ్చింది. ఆమెను కాపురానికి తెచ్చేందుకు వెళ్లిన కొడుకు సకుటుంబంగా తిరిగి వస్తాడు. పైగా బ్యాంకు ఉద్యోగి అయిన కొడుకు శ్రీవాత్సవకు త్వరలోనే ప్రమోషన్ కూడా రాబోతోందట! పై పరిణామాలకూ, ఇందాక భార్య మఫ్లర్ ఇవ్వనిదానికీ సంబంధం ఏమైనా ఉన్నదా? అని ఆలోచిస్తున్నాడు రామ్మూర్తి.

"రామ్మూర్తిగారూ! మనవల్ల కాదు గానీ, వీళ్ల తిక్క బాగా కుదిర్చేది కొడుకులే! అలా అంతా చేసినా, వాళ్లు ఆశించినట్టు కొడుకులు వాళ్లకేమీ అగ్రపీఠం వెయ్యరు. వాళ్ల ప్రవర్తన కొడుకులకు తండ్రులపట్ల ఏర్పడిన కొద్దిపాటి చులకన భావాన్ని మరికొంచెం పెంచేందుకు దోహదపడుతుందే తప్ప, తల్లులకు ఎంతమాత్రమూ ఉపయోగపడదు. అది వాళ్లు గ్రహించేసరికి జరగాల్సిన అనర్థం అంతా జరిగిపోతుంది. కొడుకు తండ్రిమీద ఎక్కుపెట్టిన నిర్లక్ష్యబాణం కాలగమనంలో తల్లికీ గురిపెడతాడు.

"అప్పటికి భర్త బ్రతికే ఉంటే జమిలిగా ఏడుస్తారు. చనిపోతే పెద్దగా ఏడ్చేందుక్కూడా భయపడుతూ, తోడు లేని వ్యథతో కూడిన ఒంటరి వేదన ఆమెకు శాపంగా మిగులుతుంది! అందుకేనండీ, రామ్మూర్తిగారూ! 'మీ కళ్లముందు సుమంగళిగా చచ్చిపోతే ఈ జన్మకు అంతే చాలు!' అంటుంది భార్య భర్తతో. భర్త మరణాన్ని చూడలేని బేలతనమో, ఒంటరి వేదనపట్ల భయమో; సుమంగళిగా చనిపోతే స్వర్గద్వారాలు తెరిచి ఆహ్వానిస్తారన్న ఊర్ధ్వలోకపు పుణ్యాపురుషులమీది విశ్వాసమో .... ఏమో!"

అలా మాట్లాడుకుంటున్న ఇద్దరూ రోడ్డు మలుపు తిరిగారు. ఎవరో కాలేజీ కుర్రాడు సైకిల్ వెనుక పుస్తకాలు పెట్టుకుని, మనోవేగంతో సమంగా సైకిల్ను పరుగు పెట్టించే ప్రయత్నంలో వీధి మలుపులో బెల్లు కొట్టాలన్న కనీసపు స్పృహనూ మర్చిపోయి వెంట్రుకవాసిలో వేణుకు సైకిలు తగిలించకుండా పక్కనుంచి బాణంలా దూసుకుపోయాడు.

"యూ ... సన్నాఫె బిచ్! స్టాప్ దేర్!" మరి వేణుకు ఎంత కోపం వచ్చిందో కానీ, ఇంకా సర్వీసులో ఉన్న పోలీసు అధికారికి మల్లే 'అశ్లీలం'గా అరిచాడు.

కాలేజీ కుర్రవాడు సైకిలు వేగాన్ని అరక్షణం తగ్గించి, "షటప్!" అని అరిచి మళ్లీ వేగం పుంజుకుని వెళ్లిపోయాడు.

వేణు ముఖం చెక్కుతీసిన బీట్‌రూట్ దుంపలా మారింది! అధికారంలో ఉండి ఉంటే మోటారు బైక్ మీద ఆ కుర్రవాణ్ణి వెంబడించి పట్టుకుని పోలీసు స్టేషన్లో, చిత్రహింసల గదిలో ....

నిస్సహాయంగా పళ్లు నూరాడు వేణు.

"పోన్లెండీ వేణూగారూ! మీకు తెలియందేవుంది! జీవితంలో అలా వెలుతురులోకో, చీకటిలోకో ప్రయాణం కట్టే చీలిక దారి వద్ద ఎటూ తేల్చుకోలేని కంగాళీ ఇంటర్ కుర్రవాడిలా ఉన్నాడతను. ఆశలు బారెడూ, అవకాశాలు జానెడూ. సింపుల్‌గా ఇంటర్లో స్టేట్ రాంకు తెచ్చుకుని, మరింత సింపుల్‌గా ఎంసెట్లో పాడో - మొదటి పది ర్యాంకుల్లో ఏదో ఒకటి తెచ్చుకుని డాక్టరుగానో, ఇంజనీరుగానో జీవితంలో కుదురుకుందామన్న ఆశ! కాలేజీల్లోనా పాఠాలు చెప్పిచావరు. ట్యూషన్లు చదవాలిగా! బాటనీ ట్యూషను మాస్టరు ఇల్లు బంగాళాఖాతం ఒడ్డునుంటే, జువాలజీ పంతులు ఇల్లు పాకిస్తాన్ బోర్డర్లో ఉంటుంది. లెక్కలవాడు కన్యాకుమారిలో ఉంటే, ఫిజిక్స్‌వాడు మంచుకొండల్లో ఉంటాడు! ఒక ట్యూషన్ విడిచిపెట్టగానే మరో ట్యూషన్‌కు ఉరకాలి కదా .... అందుకే అతడంత 'ఉన్మాదం'తో సైకిల్ తొక్కుతోంట!" అని వేణుకు సర్దిచెప్పి, పెరిగిన అతగాడి బీ.పీ.ని నియంత్రించే చిరుప్రయత్నం చేశాడు రామ్మూర్తి.

"మీరు ఎన్నయినా చెప్పండి గానీ వాస్తవానికి జనరేషన్ చెడిపోతోంది. పెద్దలంటే భయభక్తులు మృగ్యమైపోతున్నాయి. చదువును ముక్కున అలా పెట్టుకుని రాంక్‌లు సాధించటం, మెదడుకు ఏదీ ఎక్కకపోయినా బట్టీల పరిశ్రమతో చదువుల్లో గట్టెక్కి, వీసాలకూ, పాస్‌పోర్టులకూ ఎగబడటం, అవకాశం చిక్కగానే మాతృదేశానికి జల్లకొట్టి విదేశాలకు వెళ్లిపోవటం .... రామ్మూర్తిగారూ! నిజంగానే జనరేషన్ చెడిపోతోందండీ .... నిజం!" అంటూ రామ్మూర్తిని కన్విన్స్ చెయ్యగలిగానా, లేదా అన్నట్టు చూశాడు వేణు.

రామ్మూర్తి ఒకపట్టాన అంతుపట్టలేదు. తనలో తనే ఏదో మథనపడుతూ, "నిజమే కానీ, ఏం చేస్తాం! జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ అన్న భ్రమలను పోగొట్టారు మనవాళ్లు!" అన్నాడు చాలా నిర్లిప్తంగా.

ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు.

మలిపొద్దువేళ, భూగోళం కిందికి జారిపోతూ సూర్యుడు విడిచే రక్తకాంతుల్లో మెరుస్తోంది పడమటి ఆకాశం. చెట్లకొమ్మలమీంచి వీస్తున్న గాలితరంగాలు శరీరాలను తాకుతున్నాయి చల్లగా. అప్పుడప్పుడే నలుపు తిరుగుతున్న ప్రకృతిలో తలలను ఊపుతున్న కొబ్బరి చెట్లను ఇళ్లముందు చూస్తూ వెళ్తున్నారు.

నిర్విరామంగా తలలూపుతున్న కొబ్బరి మట్టలు వాళ్ల అభిప్రాయాలను అంగీకరిస్తూ, ఆ వెంటనే అంగీకరించనట్టూ - ఎవరికి వారు భావాలను అనువదించుకుంటూ ముందుకు సాగిపోతున్నారు.

వేణు ఉన్నట్టుండి కిసుక్కున నవ్వాడు.

రామ్మూర్తి కూడా నిష్కారణంగానే నవ్వుతూ, "ఏవిటండీ, అలా మీలో మీరే నవ్వుతున్నారూ?" అడిగాడు.

"మరేం లేదండీ, రామ్మూర్తిగారూ! నా మట్టుకు నాకు అనిపిస్తోంది కదా ... ఊగే ఆ కొబ్బరి మట్టలు మనం అనీ, కొబ్బరి గెలలు పిల్లలనీ! మట్టలు గాయపడి అలా విలవిల్లాడుతుంటే మట్టల మధ్యని గెలలు మాత్రం నిశ్చింతగా ఉన్నాయనీ కదండీ!" అని మళ్లీ ఓ విడత నవ్వాడు వేణు.


అప్పటిదాకా జీవితం ఓ చదవని పుస్తకం. జీవనసంధ్యలో అది నెమ్మదిగా ముగిసిపోతూ, పతాక సన్నివేశానికి చేరుకుంటోంది. ఇప్పుడైనా దాని సారాంశాన్ని పిండి, నాలుగు మాటల్లో జీవితాన్ని విశ్లేషించి చెప్పుకుంటే, అసలు మనకు ప్రకృతిసిద్ధంగా ఆనందించేందుకు సమకూడిన వనరులు ఏవిటి? పొందింది ఏవిటి? పోగొట్టుకున్నది ఏవిటీ? జీవితం ఎందుకలా చెయ్యి జారిపోతోంది? అన్నవి తేల్చగలిగితే ఒంటరితనం, బాధ, ఆవేదన అంతా మూటగట్టి అటకన వెయ్యవచ్చునేమోగానీ, అలాంటి ప్రయత్నం ఎవరిలోనూ కనిపించటంలేదు.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ అన్నాడు వేణు "రామ్మూర్తిగారూ! మన గాంధీపార్కు ఫ్రెండు సత్యంగారు ఉబుసుపోక త్యాగరాయ గానసభలకు, రంగస్థలి కార్యక్రమాలకూ వెళ్తున్నారట ఈమధ్య. విసుగెత్తిన వామనమూర్తి శృంగేరీ కళ్యాణమండపంలో వివాహాది శుభకార్యాలు ఎవరివి జరిగినా పిలవకుండానే వెళ్లి పెత్తనం చేస్తున్నారట. రిటైర్డ్ డ్రగ్ ఇన్‌స్పెక్టరు లేరూ ... ఆనందరావుగారు! రోజూ పొద్దున్నే మందులషాపు దగ్గరకి వెళ్లి షాపు ముందే కుర్చీలో కూర్చుని దినపత్రికలన్నీ చదువుతుంటారట. మొన్ననో, అటు మొన్ననో ఏదో పత్రికలో హైటెక్ గురించి ముఖ్యమంత్రి ప్రకటన చూసి మండిపడుతూ, 'ప్రసార సాంకేతిక విభాగాల్లో ఎంత అభివృద్ధి సాధించినా ఆకలి చావులు అరికట్టేదెలా? ప్రతి వ్యక్తికీ పని, అందరికీ తిండి, బట్ట, ఇల్లు, చదువు, వైద్యం అందుబాటులోకి తేవాలిగానీ, ప్రాథమిక విషయాలు విస్మరించి ఆకాశానికి నిచ్చెనలు వేస్తే ఏవిటీ ప్రయోజనం?" అన్నారట!

"మందులషాపువాడు ఏమనుకున్నాడో గానీ, 'సార్! కుర్చీ అవతల వేస్తాం, ఎంతసేపైనా కూర్చుని వెళ్లండి. బేరాలకు అడ్డం కదా!' అన్నాడట. నిన్న సాయంత్రం ఆయన నా దగ్గర మండిపడుతూ, 'నేను సర్వీసులో ఉన్నప్పుడే ఆ కొట్టువాడికి లైసెన్సు వచ్చింది. నేను గట్టిగా తనిఖీ చేస్తే వచ్చిన లైసెన్స్ రద్దయ్యేది. జైలుక్కూడా వెళ్లేవాడు!' అంటూ ఇంకా ఏదేదో చెప్పి, చేసిన మేలును మర్చిపోయే మానవ నైజాన్ని గురించి అమితంగా బాధపడ్డారు!" చెప్పాడు వేణు.

"అందులో షాపువాడి తప్పేముంది? వాడి భయం వాడిది! ఈ రోజుల్లో .... పైగా ప్రతి పార్టీకీ మానవబాంబుల్లాంటి క్రియాశీల కార్యకర్తలున్నారు. ఎవరు ఎప్పుడు ఎక్కడ విధ్వంసం సృష్టిస్తారో తెలియదు. వ్యాపారం జరిగే షాపుల దగ్గర మన ఆనందరావుగారు అలా రాజకీయాలు మాట్లాడటం అంత బాగోలేదు!" అన్నాడు రామ్మూర్తి.

"భలేవారే మీరు! ఆయనగారు డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా చేసి రిటైరయ్యారు. మెడికల్‌షాపు వాడికి అంతమాత్రం మర్యాద లేకపోతే ఎలా? సన్ ఆఫ్ బిచ్! వాడు











## హాలీవుడ్‌లో కొత్త ఫ్యాషన్!

హాలీవుడ్ స్టార్స్ సరికొత్త ఫ్యాషన్ ఇది. అదేమిటో గమనించారా?

తెల్లటి బొచ్చు కుక్కపిల్ల. ఎలిజబెత్ టేలర్, డయానారాస్, పోర్షియా డి రొస్సి, జెన్నిఫర్ లవ్ హెవిట్ మొదలైన వారు ఇటీవల ఆస్కార్ అవార్డ్స్ ఫంక్షన్‌కి వచ్చినప్పుడు ఉత్తచేతులతో రాకపోవడం గమనించిన ఓ కెమెరామెన్ తీసినఫొటో.

-డి. పద్మజ

మనుషులతో సభ్యతగా ఎలా మాట్లాడాలో నేర్చుకోకపోతే ఎలా? నేను గనుక ఇంకా సర్వీసులో ఉండి ఉంటే వాడ్ని లాకప్‌లో పెట్టి ఎముకలు విరిచేవాణ్ని! రిటైరయ్యాను కనుక బతికిపోయాడు!" అంటూ వేణు కొంచెం కటువుగానే మాట్లాడి, రక్తప్రసరణ అధికమై కాబోసు, ఆయాసంతో సన్నగా రొప్పుతూ అన్నాడు.

ఇద్దరూ గాంధీపార్కు దగ్గరికి చేరుకున్నారు.

పార్కు మెయిన్ గేటు పక్కనే చెక్క బల్లపై టీ కాచి అమ్ముతుండే ఆశీర్వాదం మీద క్రీగంటి చూపులు నిలిపి ఆగాడు వేణు.

"రామ్మూర్తిగారూ! మనం వేడివేడిగా చెరొక టీ తాగి అప్పుడు వెళ్దాం పార్కులోకి!" అంటూ రామ్మూర్తి చెయ్యి పట్టుకుని ఆశీర్వాదం టీకొట్టు దగ్గరికి లాక్కుపోయాడు.

"అరే .... ఆశీర్వాదం! ఆకు మార్చి, రెండు టీ!" అని కేక వేసి చెప్పాడు.

ఆశీర్వాదం తల పైకి ఎత్తి చాలా నిర్లిప్తంగా చూసి పక్కనే ఉన్న ఫ్లాస్కులోంచి టీని రెండు గ్లాసుల్లోకి వొంపాడు. పాత గుడ్డతో చేతులు తుడుచుకుని, గ్లాసులు తెచ్చి ఇద్దరికీ అందించి, బల్ల దగ్గరికి వెళ్లిపోయాడు.

"నేను సర్వీసులో ఉండగా ఒకసారి ఏమైందో తెలుసా, రామ్మూర్తిగారూ! రోడ్లు విశాలం చేసే పథకం వచ్చింది. మునిసిపాలిటీవాళ్లు ఆక్రమణలను తొలగిస్తోంటే, బడ్డీ కొట్టు ఖాళీ చెయ్యనని ఎదురు తిరిగాడీ ఆశీర్వాదం. మునిసిపల్ కమిషనరు దళితుడి జోలికి వెళ్లేందుకు భయపడి నాకు కబురు చేశాడు. నేను నలుగురు పి.సి.లను వెంటపెట్టుకుని వచ్చి ఆశీర్వాదానికి లాఠీతో నాలుగు ఇచ్చుకున్నాను. మా పి.సి.లు ఫ్లాస్కులు పగులగొట్టారు. బడ్డీకొట్టు చెక్కలను పీకి రోడ్డుమీద గుట్ట వేసి కాల్చేశారు. అది మొదలు ఆశీర్వాదం గాడికి నేనంటే హడలు!" అని చెప్పి, ఖాళీ గ్లాసులను పట్టుకుపొమ్మని ఆశీర్వాదాన్ని కేక వేసి పిల్చాడు వేణు.

ఆశీర్వాదం మరమనిషిలా నడుస్తూ వచ్చాడు. ఇద్దరి చేతుల్లో ఉన్న ఖాళీ గ్లాసులు అందుకున్నాడు. తిరిగి వెళ్లకుండా అక్కడే ఆగి, "డబ్బులు సార్!" అని అడిగాడు వేణువేపు చూస్తూ.

"మొత్తం ఎంత?" అని ఆశీర్వాదాన్ని అడిగాడు వేణు కొంచెం ఇబ్బందిగా రామ్మూర్తివైపు చూస్తూ.

"ఈ రెండు టీలతో గల్పి ఎంతో నూడాలి!" చెప్పాడు ఆశీర్వాదం.

రామ్మూర్తి ప్యాంటు జేబులో చెయ్యి పెడుతూ, "సారుగారి పాత బాకీ అలా ఉంచి, ఇప్పటి రెండు టీలకూ తీసుకోండి!" అంటూ ఐదు రూపాయల కాగితాన్ని బయటకు తీశాడు.

వేణు ఆ కాగితాన్ని బలవంతంగా చేతిలోంచి లాగి, మళ్లీ రామ్మూర్తి జేబులోనే తోస్తూ, "మీరు ఇవ్వటమేంటండీ ... భలేవారే!" అని మళ్లీ ఆశీర్వాదం కేసి తిరిగి, "ఆశీర్వాదంగారూ! మీ డబ్బులు ఈ రోజు ఇద్దామనే అనుకున్నాను. కానీ పొద్దునే పాలవాడు వచ్చి ఇంకో గేదెను బేరం చేశాట్ట. ఓ వెయ్యి అప్పు కావాలని పట్టుకుపోయాడు. ఇంట్లోంచి అడుగు బయట పెట్టానో, లేదో పక్కింటాయన వచ్చి భార్యకు బాగాలేదని చెప్పి ఐదొందలు అడిగి తీసుకుని వెళ్లాడు. సరిగ్గా అప్పుడే మా ఆవిడ బయటకు వచ్చి కరెంటు బిల్లు జ్ఞాపకం చేస్తే, జేబు ఖర్చులకు ఉంచుకున్న మూడొందలూ ఇచ్చేశాను ..." అంటూ వేణు తన జేబులు ఖాళీ అని చెప్పేందుకు గౌరవప్రదంగా ఉండే మరిన్ని కారణాలను ఊహించి చెప్పబోతే మధ్యలోనే అడ్డుకున్నాడు ఆశీర్వాదం.

"నాకు తెలవదా ..... తఁవర్ది యన్నపూసనుమంటి మనస్సు! ఎవురుకి కట్టం వొచ్చినా సూళ్లేరు. తఁవరనుమంటోళ్లు ఎల్లకాలం సల్లంగుండాల. వొయసు మళ్లిపోతాందిగా బాబూ, ఇంక కాపీలూ, టీలూ మానీయండి!" అని హితవు చెప్పి ఖాళీ గ్లాసులు తీసుకుని వెళ్లిపోయాడు.

ఇంతకూ అతను వేణును పొగిడినట్లో, తెగడినట్లో ఒక్క క్షణం అర్థం కాలేదు రామ్మూర్తికి! జడిగా కురిసేందుకు మోహరించిన కారుమబ్బులు సుడిగాలికి విడిపడి అదృశ్యమైనట్టు క్రమంగా సందేహాలన్నీ విచ్చిపోతూ జీవిత సత్యం ఏదో కళ్లముందు కనిపిస్తున్నట్టే తోచింది అతడికి!

'ఇలాగే జీవితం చెయ్యి జారిపోతోందా?' తనను తానే ప్రశ్నించుకున్నాడు రామ్మూర్తి.

'ఇంకా ఏం మిగిలింది కనుక చెయ్యిజారిపోను?' అంది అంతరాత్మ.

'జీవితంలో నా బాధ్యతలను నేను సక్రమంగా నిర్వహించాను. పూర్తిగా అలసిపోయి,. జీవన సంధ్యలో అడుగుపెట్టాను. నా వాళ్లను నేను ప్రయోజకులను చేశాను. జన్మనిచ్చానన్న సానుభూతితో కాదు, వాళ్ల జీవితాలను తీర్చిదిద్దానన్న కృతజ్ఞతతో అయినా వారు నా శేష జీవితానికి

భద్రత కల్పించాలి కదా!'

'పిచ్చివాడా! ఒకసారి గతంలోకి తొంగి చూడు. గోరుముద్దలు పెట్టి లాలిపాటలు పాడిన అమ్మను ఒక దశ దాటగానే విస్మరించావు. జీవిత నిర్మాణంలో ఆలంబనగా నిలిచిన తండ్రిని ప్రయోజకుడివి కాగానే చులకన చేశావు. అధికారంలో ఉండగా సంఘాన్ని తృణీకరించావు. భౌతిక శరీరం నిర్వీర్యం కాగానే భార్యను నిరుపయోగ వస్తువుగా ఎంచి విస్మరించావు. అందుకు ప్రకృతి నీకు ఇచ్చిన శాపమే ఒంటరితనం! అది కూడా ఎక్కడో లేదు. నిన్ను అంటిపెట్టుకుని నీ మనసులోనే ఉంది!'

గేలి చేస్తున్న అంతరాత్మ వికటాట్టహాసాల మధ్య ఉక్కిరిబిక్కిరి అవుతూ భారంగా తల విదుల్చుకున్నాడు రామ్మూర్తి. దీర్ఘంగా నిట్టూర్చి గాంధీపార్కులోకి వెళ్లాడు వేణు వెంట, ఉబుసుపోని ఒంటరి వేదనతో రగిలిపోతున్న మరికొందరి నుంచి ఏదో సాంత్వన ఆశిస్తూ.

***

"రండి! రండి! ఇంత ఆలస్యంగా వచ్చారేం ఈ రోజు?" అంటూ దూరం నుంచే రామ్మూర్తిని, వేణుని పిల్చాడు మాజీ గుమాస్తా సుబ్బారావు.

ఇద్దరూ ఒకేసారి తల ఎత్తి చూశారు.

అక్కడ చాలామంది 'స్వజాతి జనం' గడ్డిపరకలమీద కూర్చుని కబుర్లాడుతూ కనిపించారు. వేగంగా నడుస్తూ వెళ్లి వాళ్ల సరసన కూర్చున్నారు. పార్కులో విద్యుద్దీపాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. ఆ తెల్లటి కాంతి పచ్చటి చెట్లమీద ప్రసరిస్తూ పార్కుకు వింత శోభను సమకూరుస్తోంది. చెట్లమీది గూళ్లకు చేరుకున్న పక్షులు ఇంకా అక్కడ కనిపిస్తున్న నరసంచారానికి విసుక్కుంటూ అందరూ వెళ్లిపోతే పిల్లపక్షులతో కలిసి నిద్రపోదామని కాబోలు గుడగుడలాడుతూ గూళ్లలోంచి తొంగి చూస్తున్నాయి.

రిటైర్డ్ పంతులమ్మ రాజ్యలక్ష్మిగారు భూతద్దాల కళ్లజోళ్లోంచి దారినీ, అక్కడక్కడా కూర్చున్న జనాన్నీ పరిశీలనగా చూస్తూ, ఎలాగైతే నేం, 'స్వజాతిని' చేరి రామ్మూర్తి పక్కనే కూర్చుంది ఆపసోపాలు పడుతూ.

ఆమె కూడా ఒక ఆవేదనే రామ్మూర్తికి! ఇద్దరూ వయసులో ఉన్నప్పుడు ఆమె ప్రేమ సామ్రాజ్యానికి పట్టాభిషిక్తుడ్ని చెయ్యమని ఎంతగా బతిమాలాడో తను! ఎంతగా ప్రాథేయపడ్డాడో!

యౌవనం, అందం, ఒంటి బిగువూ అన్నీ శాశ్వతమనుకుందేమో, ఏ విషయమూ తేల్చి చెప్పకుండా ఏండ్లూ, పూండ్లూ గడిపి, రిటైరయ్యాక పెన్షన్‌లో ఆరు రూపాయలు ఇంకా కలవాలని అర్జీ రాయించుకుందుకు వెదుక్కుంటూ ఒకరోజు రామ్మూర్తికోసం పార్కుకు వచ్చింది రాజ్యలక్ష్మి. పని పూర్తి చేసినా ఒకపట్టాన ఆమె విడిచిపెడితేనా! రోజూ పార్కుకు రావటం, వెదికి చూసి మరీ రామ్మూర్తి సరసనే కూర్చుని భూతద్దాల కళ్లజోళ్లోంచి అతడ్ని ఆరాధనగా చూడటం ...

ఛీ! ఛీ! నిర్ణయం ఒక జీవితకాలం లేటు!

ఎందుకలా వృథాగా కొరుక్కు తినేట్టు చూస్తావ్?

"నాదొక చిన్న ప్రశ్న!" అని పెద్దగా అన్నాడు సుబ్బారావు.

"ఏమిటది?"

"మనిషి చనిపోతే ఏమౌతాడు?"

అది చిన్న ప్రశ్నా? దానికి సమాధానం తెలుసుకునే అన్వేషణలో ఎంతమంది జీవితాలు జేగురు నీరుకావి బట్టలకు అంకితమై, శరీరాలను హింసించి నిప్పుల్లో కాలిపోయాయో! భౌతికంగా వాళ్లంతా గతించి, స్థూల శరీరాన్ని విసర్జించి సూక్ష్మ శరీరులైనా, ఆ సత్యాన్ని కనీసం వాళ్ల ఆత్మలు తెలుసుకున్నా అంతే చాలు అనుకుంటే పేచీయే లేదు; వాళ్ల ఆత్మలు మనకు ఏమీ చెప్పవు కనుక! తెగించి మనమే అలా వెళ్లి ఆత్మతో ఆ సత్యాన్ని తెలుసుకున్నా - శతకోటి లింగాల్లో ..... అంతేగానీ, అది ఎప్పుడూ శేషప్రశ్నే!

"ఎవ్వరూ చెప్పలేరా?" మళ్లీ హెచ్చరించాడు సుబ్బారావు.

మౌనం సమాధానమైంది.

"మనిషి చచ్చిపోతే మరేమీ కాడు, చచ్చిపోతాడంతే!" అని కిసుక్కున నవ్వాడు.

'ఒక మనిషి అంత ఆనందంగా నవ్వటం ఏంటబ్బా?' అన్నట్టు వింతగా చూస్తోంది రాజ్యలక్ష్మి.

"నిజమండీ, రాజ్యలక్ష్మిగారూ! మనిషి చచ్చిపోతే మరేమీ కాడు, చచ్చిపోతాడంతే! నా మట్టుకు నేను ఎప్పుడో చచ్చిపోయాను. అయినా భవబంధాలను తెంచుకోలేకా, కన్నబిడ్డలమీద మమకారం చావకా ఇంకా ఇక్కడే కొట్టుకులాడుతూన్నానే గానీ, నిజానికి నేనెప్పుడో చచ్చిపోయాను!" అని మళ్లీ పెద్దగా నవ్వాడతను.

'మీరు గొప్ప గాయకులైతే నా గుండెలోని విషాదాన్నంతా మీ గొంతులో ఒలికించండి!' అని నవ్వుతూ అడిగినట్టూ, ఆ నవ్వు తెరల లోపలి పొరల్లో ఎంత దిగులు పేరుకుని ఉందో అణువణువునా!

నవ్వుతున్నాడు కనుక ఎవ్వరూ అతడికి సాంత్వన వచనాలతో ధైర్యం చెప్పలేదు. అలా చెప్పి ఉంటే తెరలు తెరలుగా వస్తున్న ఆ నవ్వే

## పెర్ఫెక్ట్ ఫిట్!



ఆకలేసిన ఒంటె అతన్ని తింటోందనుకోకండి. జోసిట అనే పేరుగల ఈ ఒంటెకు ఆహారం కాదు పాల్ టిమ్స్ ఇంగ్లండ్‌లోని ఓ ట్రావెలింగ్ సర్కస్ కంపెనీలో ఈ రెండు జీవాలు పనిచేస్తున్నాయి. రోజుకి మూడుసార్లు పాల్ తల నిలా నోట్లు ఉంచుకుంటుంది ఒంటె.... కొరకకుండా. ఒంటె దంతాలు బహు గట్టివి కాబట్టి కొరికితే ఇంతేసంగతులు! ఈ ఫీట్ పాల్ కనిపెట్టిందే! ఈ ఒంటెకి ఏడాదిన్నరపాటు శిక్షణ ఇచ్చాడు.

-డి. పద్మజ

విషాదపు అలలై పొర్లిపొర్లి ఏడ్చేవాడు. కడివెడు కన్నీళ్లు కార్చేవాడు.

"సుబ్బారావుగారు అలా మాట్లాడారంటే ఇంట్లో ఏదో కాష్ఠం రగిలినట్టే; మనిషి బయటపడి చెప్పటంలేదు కానీ!" అన్నాడు రామ్మూర్తి చెవిలో వేణు రహస్యంగా.

"ఏం జరిగుంటుందబ్బా?"

అప్పుడు కల్పించుకుంది రాజ్యలక్ష్మి .... "ఓ .... అదా! మరేం జరిగిందంటే ...."

"హుష్! పెద్దగా అరవకు! ఆ విషయం తర్వాత మాట్లాడుకుందాం!" అని హెచ్చరించాడు రామ్మూర్తి రాజ్యలక్ష్మిని.

ఆమె మౌనం దాల్చింది.

త్యాగరాయ గానసభ నుంచి అర్ధాంతరంగా లేచి పార్కుకు వచ్చి అందరి వెనుక ఎప్పుడు కూర్చున్నాడో కానీ, సత్యంగారు లేచి అందరినీ తప్పించుకుంటూ ముందుకు వచ్చాడు. బుగ్గల్లో దాచుకుని ఇంకా నమలకుండా మిగిల్చిన నాలుగు సెనగ గింజలను నాలుకతో పంటికిందికి తెచ్చుకుని నములుతూ సుబ్బారావును అనుకుని కూర్చున్నాడు.

నమిలి పిండి చేసిన సెనగ గింజలను మింగి, "ఏమన్నారు సుబ్బారావుగారూ! మీరు ఎప్పుడో చచ్చిపోయారా? నాకు మాత్రం ఇంకా నేను చావలేదనే నమ్మకం ఉంది. చావకూడదన్న పట్టుదలా ఉంది. ఎంచేత? అంటే, ఇంకా నేను వేధించాల్సిన వాళ్లు చాలామంది ఉన్నారు!"

"ఎవరు?" శృంగేరి కళ్యాణమండపంలో ఆ రోజు ఎలాంటి శుభకార్యాలూ లేక పార్కుకు వచ్చి కూర్చున్న వామనమూర్తి చాలా ఆసక్తిగా అడిగాడు.

"మొదటిది నా భార్య. రెండు నా కొడుకు. మూడు నా కోడలు! ఆ ముగ్గుర్నీ తృప్తితీరా ఏడ్పించేదాకా యమపాశానికి కూడా అందనండోయ్!" అన్నాడు చాలా ఉద్రేకంగా.

కొంచెం ఆయాసం వచ్చింది. దగ్గూ వచ్చింది. గుండె చిక్కబట్టిందేమో, చేత్తో గుండెమీద రుద్దుకుంటూ కూర్చున్నాడు వామనమూర్తి.

అందరికీ శత్రువులు అలాంటివాళ్లే; అందుకే ఒక్క మనిషీ నవ్వలేదు!

"లెగవండిక సార్లూ .... పార్కుకు తాళంబెట్టే యాళయింది!" అని హెచ్చరించాడు తోటమాలి.

అందరూ పైకి లేచారు. పార్కు దాటి బయటకు వచ్చారు. ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోయారు. రాజ్యలక్ష్మి మాత్రం రామ్మూర్తిని అంటిపెట్టుకునే ఉంది. రోడ్డుపక్కగా ఇద్దరూ పక్కపక్కనే నడుస్తున్నారు.

"ఇందాక నువ్వు సుబ్బారావు విషయం ఏదో తెలుసన్నావు కదా!" అని దారిలో గుర్తు చేశాడు రామ్మూర్తి.

"ఆఁ.... ఆఁ .... మా పక్క ఇల్లే వాళ్లది. నిజం చెప్పాలంటే అది ఇల్లు కాదు. నరకం!" అంది రాజ్యలక్ష్మి ముఖాన్ని వికారంగా పెడుతూ.

ఆశ్చర్యంగా చూశాడు రామ్మూర్తి.

"అవునండీ .... నిజం! సుబ్బారావుగారి భార్య చనిపోయి చాలా కాలమైంది. రిటైరు కాకముందు ఉద్యోగ విధులు, కాంపులూ, ఆఫీసు ఫైళ్లూ .... అంతా తన భుజస్కంధాలమీదనే జరుగుతున్నట్టు చాలా బిజీగా ఉండేవారు. తనకు తాను ఆపాదించుకున్న ఆ సిగ్నిఫికెన్స్ అతడికి కవచంలా ఉపయోగపడింది! తనను గురించి తాను ఆలోచించకుండా, అంతరాత్మ గోడు పట్టించుకోకుండా, మానసికంగానూ, భౌతికంగానూ అవసరాలను గుర్తు చేస్తూ మెదడు ఇచ్చే సిగ్నల్స్‌ను బలవంతంగా విస్మరిస్తూ ఆ కవచంలో నేర్పుగా దాక్కునేవాడు. ఆ కవచాన్ని పగలగొట్టలేక ఒంటరితనం కూడా అతడి దాపుకు చేరి వేధించేది కాదు.

"అలాంటిది రిటైరు కాగానే అంతా తారుమారైంది! ఆఫీసు పట్టిపోలేదు! దాని కార్యక్రమాలు మామూలుగానే జరిగిపోతున్నాయి. విమానాలు, రైళ్లూ, బస్సులూ అన్నీ నడుస్తూనే ఉన్నాయి. వీధుల్లో జనం కంగాళీగా తిరుగుతూనే ఉన్నారు. జనన మరణాలూ ఆగిపోలేదు. ఎన్నికలూ జరుగుతూనే ఉన్నాయి. కనీసం సూర్యుడైనా పడమటి దిక్కున ఉదయించటంలేదు. వెన్నెల తెల్లగానే ఉంది."

"అయితే?"

"సిగ్నిఫికెన్స్ భ్రమలు అలా తొలగిపోయి అంతదాకా వారు తమ చుట్టూ చుట్టుకున్న కవచం పగిలి బీటలు బారిపోయింది. దాంతో ఒంటరితనం వెంటాడి వేధించటం ప్రారంభించింది. పగిలిపోయిన గుల్లలోంచి బయటపడిన నత్త మరో ఖాళీ నత్తగుల్లలో దూరి ఆశ్రయం పొందినట్టు 'జీవితం చెయ్యిజారిపోలేదు' అన్న మరో భ్రమలోకి వెళ్లిపోయారు. బీద ఇంటి పడుచుపిల్లను వృద్ధాప్యంలో పెళ్లి చేసుకున్నారు!"

రామ్మూర్తి నడుస్తున్నవాడల్లా ఠక్కున ఆగి ఆశ్చర్యంగా చూశాడు.

"ఆమె కేవలం అతడి ఒంటరితనాన్ని పోగొట్టే కబుర్ల యంత్రం కాదు కదా? పొరుగింటి పరంధామయ్యతో పరిచయం పెంచుకుంది. అది విశ్వాసఘాతుకం అని బాధపడుతూంటాడు సుబ్బారావు. కాటికి కాళ్లు చాపిన వాడికి కళ్యాణం దేనికీ? అన్నదే కొడుకూ, కోడలి వాదం. పెద్దలను గౌరవించక, క్రమశిక్షణ ఉల్లంఘిస్తూ జనరేషన్ పాడైపోతోందంటూ వారు పార్కులోనే కాదు, ఇళ్లమధ్య కూడా ఒకటే గోల!" చెప్పింది రాజ్యలక్ష్మి.

రామ్మూర్తి ఆమెవైపు అబ్బురంగా చూశాడు. మరిచిపోయిన మౌనరాగాలను మననం చేసుకుంటూ, ఏదో ఒక విషాద వీచిక ముఖంలో తుళ్లిపడి, అంతలోనే అదృశ్యం కాగా ఆర్తిగా చూస్తూ, "రాజీ! జీవితాలను భిన్నకోణాలలో పరిశీలించే యోచనా, మనసుకూ భౌతిక శరీరానికీ కలిగే స్పందనల సాంద్రతా తెలిసిన నువ్వే అలా నన్ను తిరస్కరించి నా జీవితకాలంలో కొంత భాగాన్ని ఆవేదనకూ, మరికొంత భాగాన్ని స్తబ్ధతకూ ఎందుకు గురిచేశావు?" అని జీరగొంతుతో అడిగాడు రామ్మూర్తి.

ఆమె కిలకిలా నవ్వింది. మరికొంచెం దూరం మౌనంగా నడిచింది.

రామ్మూర్తి దారి నుంచి తన గూటికి చేరుకునే చీలిక దారి వద్ద నిలబడి తన మార్గాన తాను వెళ్లేందుకు ఉద్యుక్తురాలవుతూ ఎందుకో ఒక్క క్షణం రామ్మూర్తిని పరిశీలనగా చూసింది.

ఈమధ్యకాలంలో ఎన్నడూ కనిపించనంత అశాంతితో కనిపించాడు. గుండె పొరల్లో ఎక్కడో నిక్షిప్తమైన జ్ఞాపకాలు పైకి తన్నుకుని వస్తూ అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తూ ....

"రామ్మూర్తిగారూ! ఈ వయసులో భార్యా, బిడ్డలు ఉండి కూడా మీరు ఒంటరితనంలో కూరుకుపోతూ ఎంతగా వ్యథపడుతున్నారో నేనూ అంతే! ఒక దశలో నన్ను మీరు ఆరాధించారు. అభిమానించారు. నా ఆలోచనలతో గుండెలో నెగడు అంటించుకుని కాలిపోతూ ఎన్నో రాత్రులు నిద్రలేమికి గురయ్యారు.

"నా వైపునుంచి ఎంతకూ అంగీకారం అందకపోవటంతో ఆ ఆరాధనా భావాన్ని గుప్తంగా గుండెలో పదిలపరుచుకున్నారు. వయసు మీరి ఒంటరి వేదనతో సతమతమవుతున్నా, మీకు తెలియకుండానే నేను కనిపించినప్పుడల్లా మీ కళ్లల్లో ఏదో మెరుపు మెరుస్తోంది. నిజానికి నా పరిస్థితి కూడా అంతే! ఆ రోజు మీ దగ్గరకి నేను ఆరు రూపాయల

అదనపు లాభం కోసం అర్జీ రాయించుకుందుకు రాలేదు నేను. అది ఒక విషయం మాత్రమే! మీ చెంత ఒక్క నిమిషం కూర్చున్నా, ఒక రోజు జీవితయానానికి సరిపడేంత ఇంధనం నింపుతుంది మీ సాంగత్యం నాకు. ఆ మహిమ మీలో ఉన్నదో, నాలో ఉన్నదో, మనిద్దరి మధ్యన ఆకర్షణలోనే ఉన్నదో నాకు తెలియదు. ఇలాంటి భావావేశం గతంలో కూడా కలిగేది నాకు. కానీ భయం దాని గొంతు నులిమేది. ఈ వార్ధక్యంలో మనం మానసికంగా తప్ప భౌతికంగా ఒకళ్లనుంచి ఒకళ్లం ఆశించేదేమీ లేదు. అయినా ఏమిటి ఈ ఆకర్షణ? అది ఎలా ఇంతకాలం నిద్రాణమై గుండెల్లోనే మేట వేసుకుపోయింది?

"థాంక్ గాడ్! మనం భౌతికంగా కలుస్తూ ఉంటే ఈ పాటికి మీ మీద నాకూ, నా మీద మీకూ మొహం మొత్తేది. ఒకళ్లకొకళ్లం చులకన అయ్యేవాళ్లం. భారంగా తోచేవాళ్లం. జనావాసాల్లో ఉంటూ కూడా ఏ మారుమూల కొండల మీదనో, గుట్టలమీదనో మౌనంగా రోదిస్తున్న ఒంటరి శిలువకు మల్లే మనమూ ఎవరికి వాళ్లం మిగిలిపోయేవాళ్లం. అలా జరగలేదు.

"అదృష్టవంతులం కదూ....! మనలను మనం ఓదార్చుకుందుకూ ఒకళ్లకొకళ్లం సాంత్వన కలిగించుకుందుకూ చివరికంటా మిగిలిన ముఖం మొత్తని పరిచితుల్లా అయినా మిగిలిపోయాం!" అని గవ్వలు దొర్లించినట్టు గలగలా నవ్వి తన దారిన వెళ్లిపోయింది రాజ్యలక్ష్మి.

అతడు నిజానికి ఆమెను చూసిన తొలిచూపులోనే ఆకర్షణకు లోనయ్యాడు. తనకు పెళ్లయిందనీ, పిల్లలున్నారనీ మరిచిపోయి ఆమె సాంగత్యాన్ని కోరలేదు. అన్నీ తెలిసే ఆశించాడు. స్పృహలోనే ఆరాధించాడు. కానీ, ఆ ఆశ, ఆరాధన మొలకెత్తిన క్షేత్రం అతడి హృదయం కాదు; అవకాశం ఉంటే ఆనందిద్దాం అన్న ఒక భావావేశం మాత్రమే! ఇంత నిబ్బరంగా ఉండగలిగింది కూడా అందుకేనేమో!

వీధివాకిలి ముందు నిలబడి తలుపు తట్టాడు. పార్వతమ్మే వచ్చి తలుపు తెరిచింది. చిల్లుల చింకిచాటంత ముఖం, నూర్పుల కొత్త చాటంతై, విప్పారిన కళ్లతో ఆనందంగా నవ్వులు కురిపిస్తూ, "యావండోయ్! ఎవరొచ్చారో చెప్పుకోండి చూద్దాం!" అని అడిగింది, గుమ్మంలోంచి పక్కకు తొలగుతూ.

రామ్మూర్తి చెప్పులు విడుస్తూ పక్కనే ఉన్న చెప్పుల జతలను చూశాడు. "ఇంకెవరూ .... మన అబ్బాయీ, కోడలూ వచ్చారులే! మనుమడు బాగున్నాడా? కొంచెం ఒళ్లు చేశాడా? ఇంకా 'ఉంగా.... ఉంగా'యేనా, లేక 'తాతా.... తాతా' అంటున్నాడా?" అని ప్రశ్నల వర్షం కురిపిస్తూ హడావుడిగా కొడుకు గదిలోకి వెళ్లాడు.

"ఏమ్మా, బాగున్నావా? ఏరా ... ఎప్పుడొచ్చారూ?" అని కొడుకునీ, కోడలినీ పలకరించి, వాళ్ల సమాధానంకోసం ఎంతమాత్రమూ ఆసక్తి చూపించకుండా కోడలి మంచం పక్కనే ఉన్న ఉయ్యాల దగ్గరికి వెళ్లాడు. ఇంకా నిద్రపోకుండా ఇంతలేసి కళ్లతో అబ్బురంగా చూస్తూ, చిరునవ్వులు చిందిస్తున్న మనుమడిని అమాంతం పైకి తీసుకుని గుండెకు హత్తుకున్నాడు.

ఆ స్పర్శలో ఎంత ఆనందం ఉందో! ఎంత హాయి ఉందో! ఆ హాయీ, ఆనందం .... ఎంతకూ తనివి తీరితేనా!

తనలో తనే మురిసిపోతూ ఒక్క క్షణం వాడి ముఖంలోంచి దృష్టిని మరల్చాడు. భార్యవైపు గర్వంగా చూస్తూ, హుందాగా నవ్వాడు; ఈ శుభ పరిణామాలన్నింటికీ తానే మూలం అన్నట్టు!

"సంబరం ఇక చాల్లే గానీ, వెళ్లి కాళ్లు కడుక్కురండి; భోజనం వడ్డిస్తాను!" అంది పార్వతమ్మ.

'ఎంత తిరస్కారం? అయినా ఆకలి నాది. తినాల్సిన వేళ విషయంలో కూడా నియంతృత్వమా? నేను తినాలనుకున్నప్పుడు తింటాను. పడుకోవాలనుకున్నప్పుడు పడుకుంటాను. అన్నం పెట్టమంటే పెట్టటం, పక్క వెయ్యమంటే వెయ్యటం మాత్రమే నీ పని!' అన్నట్టు భార్యవైపు కొరకొరా చూశాడు రామ్మూర్తి. ఆమెకు తన నిరసన తెలియజేసే చర్యగా వాణ్ని మరింత గాఢంగా గుండెకు హత్తుకున్నాడు.

అందరూ అతడివేపు వింతగా చూశారు.

రామ్మూర్తి అదేమీ పట్టించుకోకుండా ఏవో ఊహల్లో తేలిపోతూ ...

శ్రీవాత్సవకు కూడా అప్పుడు మనుమడంత వయసే! దేవుళ్లతో మాట్లాడుతూ నిద్రలో కూడా నవ్వుతూంటారట పొత్తిళ్ల పసిబిడ్డలు! అలాంటి నవ్వులూ; కాళ్లూ చేతులూ ఆడిస్తూ, భౌతిక శరీరానికి బలాన్ని చేకూర్చే సహజసిద్ధంగా వచ్చే వ్యాయామం 'చేస్తూ; నెమ్మదిగా పక్కకు దొర్లటం, ఆ పైన అంబాడేందుకు ఆత్రుతపడటం ...

శ్రీవాత్సవ పొట్టతో పాకేవాడు కొంతకాలం. తర్వాత మోకాళ్లమీద బరువంతా ఆన్చిపెట్టి లేచేందుకు చేతులతో నేలను తోసేవాడు. లేచేందుకు అలవికాక భూమిని కరుచుకుని పడుకునేవాడు. కొంచెం విశ్రాంతి అనంతరం మళ్లీ అదే తంతు!

ఇంటిల్లిపాదీ శ్రీవాత్సవ ప్రయత్నాలను చూసి మనసారా నవ్వేవాళ్లు. ఆనందం పట్టలేక చప్పట్లు చరిచేవాళ్లు. వంతులవారీగా ఎత్తుకుని ముద్దుల్లో ముంచెత్తేవాళ్లు....

రామ్మూర్తికి ఒక్క క్షణం, ఏనాడో చనిపోయిన అమ్మ గుర్తొచ్చింది! తను ఆ వయసులో అలాగే అంబాడితే ఆమె కూడా ఎంతగా ఆనందించిందో! అటువంటి అమ్మకు తను ఏదో బాధ్యతా నిర్వహణలా ఆమె వృద్ధాప్యంలో వేళకింత అన్నం మాత్రం పెట్టాడు కానీ, ఆమె ఒంటరితనపు ఆవేదనను తొలగించే ప్రయత్నమేదీ చెయ్యలేదు!

శ్రీవాత్సవ పెరిగి పెద్దయ్యాడు. సంపాదనపరుడూ, ఒక బిడ్డకు తండ్రి కూడా అయ్యాడు. భార్యా, తన బిడ్డా తప్ప అన్యం పట్టించుకోకుండా అతనూ గతంలో తను ప్రవర్తించినట్టే ప్రవర్తిస్తే? అమ్మో....! రక్తసంబంధాలు కూడా అలా విచ్చిపోతూ యాంత్రికతకు మాత్రమే పరిమితమైతే ఎంత ఆవేదన!

"కదలరేం! వెళ్లి కాళ్లు కడుక్కురండి!" అంది మళ్లీ పార్వతమ్మ.

అప్పటిదాకా కొంచెం ఇబ్బందిగానే తండ్రివేపు చూస్తున్న శ్రీవాత్సవకు మాట్లాడే అవకాశం వచ్చినట్టు తోచింది! "నాన్నగారూ! వేళపట్టున భోంచెయ్యటం మీ వయసులో చాలా అవసరం. వెళ్లి భోజనం చెయ్యండి. పైగా పసిపిల్లలను అలా అస్తమానూ ఎత్తుకుని ఆడిరచకూడదు. మన శరీరంలోని వేడికి పసివాళ్లు కాగిపోతారు!" అన్నాడు అదోలా చూస్తూ.

విద్యుత్తీగను ఒంటికి అంటించినట్టే ఉలిక్కిపడి కొడుకువేపు విస్మయంగా చూశాడు రామ్మూర్తి.

"అలా అన్నానని బాధపడకండి, నాన్నగారూ! పిల్లలు చక్కగా కింద దొర్లుతూ, కేరింతలు కొడుతూ ఆడుకుంటుంటే చూసి ఆనందించటం మంచిది కానీ ...." అని ఇంకా అనబోయినవాడల్లా సభ్యతకోసమో, ఇంకా పూర్తిగా విచ్చిపోని 'పెద్దల ఎడల గౌరవం'కోసమో కానీ, గొంతును నియంత్రించుకుని పరాయి భాషలో రామ్మూర్తిని అభ్యర్థించాడు "నాన్నా ... ప్లీజ్!" అని.

రామ్మూర్తికి భూమిలోకి కూరుకుపోతున్నట్లే తోచింది. అక్కడ కోడలు పిల్లకూడా ఉంది. నిన్నగాక మొన్న ఎక్కడినుంచో వచ్చి తమ గూట్లో కుదురుకున్న ఆమె ముందు కొడుకు తనకలా జ్ఞానబోధ చేయటం, ఛీ.... ఛీ!

మనుమడ్ని నెమ్మదిగా కిందికి దించి, ఓ బొమ్మను వాడిముందుకు తోసి రామ్మూర్తి నేరుగా బెడ్‌రూమ్‌లోకి వెళ్లాడు. మంచంమీద వాలిపోయి దీక్షగా శూన్యంలోకి చూస్తూ పడుకున్నాడు.

'ఆ వెధవ, శ్రీవాత్సవ .... వేలెడెంత వెధవగా ఉన్నప్పుడు నా చంకనెక్కి, అమ్మ పెడుతున్న గోరుముద్దలను 'బూచి ఆట'' ఆడుతూనే అరగించేవాడు. అమ్మ కుడివేపు నుంచి వస్తే ఎడమవేపూ, ఎడమవేపు రాగానే కుడివేపూ నా మెడమీంచి అటూ ఇటూ ముఖం మార్చేవాడు. ఆ కదలికలో వాడి నోటి తడి నా ముక్కుకు తగిలేది. ఆ తడిలోంచి వచ్చే ఏదో పరిమళం .... దాన్ని ఆబగా పీల్చుకుంటూ మధురానుభూతికి లోనవుతూ ....

ఆ అనుభవం శాశ్వతమైతే ఎంత బాగుంటుంది!

కానీ వాడు వయసును సంతరించుకుంటూ పెద్దల భుజాల ఆసరాను విసర్జించి తన లేత పాదాలమీదా; మరికొంచెం పెరిగి ఎవ్వరిమీదా ఆధారపడకుండా స్వతంత్రంగా ఆలోచించటం ... స్వతంత్రంగా జీవితంలోకి వెళ్లిపోవటం ...

వాడి ప్రగతి ఒక విధంగా హర్షనీయమే అయినా వాడిమీద కోల్పోతున్న నా పట్టును గురించే కదా నా బెంగ!

వాడు పెరిగి పెద్దవుతుంటే అలాగే చూస్తూండిపోయాను. వాడి ఎదుగుదలమీద నా నిఘాకీ, వాడి ఎదుగుదలకూ పొంతనే లేదు. నన్నసలు పట్టించుకున్న దాఖలాలే లేవు. 'అందరి పరిస్థితీ అంతే!' అన్న వాస్తవం గుర్తొచ్చాక కానీ ఊరట చెందలేకపోయాను.

ఎప్పుడూ వాడు నా మాట వింటూ, నా మీద ఆధారపడుతూ, నాకు ఆనందాన్నిస్తూ శాశ్వతంగా అడ్డాల బిడ్డగానే ఉండే వరం ప్రసాదించేవాణ్ని కానీ, అలాంటి మహిమలు, దైవత్వం నాకు లేవు; వట్టి రామ్మూర్తినే!

అవసరం కోసం ఊసరవెల్లి రంగులు మార్చినట్టు, గూడు కోల్పోయిన నత్త మరో గుల్లలోకి మారినట్టు .... అభిప్రాయాలను మార్చుకున్నాను ఒక దశలో.

ఇంకా ఎన్నాళ్లులే నా కీ బాధలు! పిల్లగాడు పెరిగి పెద్దవుతున్నాడు. విద్యాబుద్ధులు నేర్చి వాడొక ఉద్యోగంలో కుదురుకుని ప్రయోజకుడైతే నా జీవితం ఇక గట్టున పడ్డట్టే! ఈ జీవన సంధ్యలో అలాంటి శాంతి కావాలి నాకు. ఏ క్షణంలో సూర్యుడు పడమటి కనుమల్లోకి జారి అదృశ్యమైపోతాడో! ఏ క్షణంలో హంస లేచిపోతుందో!!

నిజంగా ఆవేదన నుంచి మనిషి నిబ్బరపడేందుకు ఎన్ని చమత్కారాలున్నాయో సృష్టిలో! సృష్టికర్తను అభినందించాలి. బహుకొద్దిమందికి పరిమితమైన రక్తసంబంధాలకే మనిషి ఇన్ని ఇక్కట్లకూ, ఆవేదనకూ గురవుతుంటే, ఇంత పెద్ద విశ్వసృష్టికి కారకుడైన అతను నిబ్బరంగా ఎలా ఉంటున్నాడబ్బా?!

దశలవారీగా మనుషులకు ఆశలు రేపుతూ ఊరిస్తున్నాడు. కడదాకా జీవించేట్టు చేస్తున్నాడు. జీవిత చరమాంకంలో కూడా బతుకు పుస్తక సమీక్షలో కాలం వెళ్లదీస్తూ మలిసంధ్య కూడా దాటి కాలగర్భంలో కలిసిపోయేలా చేస్తున్నాడు ....

తలుపు చప్పుడైంది. పార్వతమ్మ లోపలికి వచ్చింది.

"ఏమిటండీ, అదోలా ఉన్నారూ?'' అని అడిగింది రామ్మూర్తిని.

రామ్మూర్తి చివాల్న మంచంమీంచి లేచి కూర్చున్నాడు. "నేను ఎలా ఉంటే నీకేం?'' అన్నాడు ముఖం గంటు పెట్టుకుంటూ.

పార్వతమ్మ భర్తపక్కనే కూర్చుంది. "అయినా ఏం జరిగిందని అంత కోపంగా వచ్చేశారు? ఏమిటో, ఈమధ్య మీ వాలకం బొత్తిగా అర్థం కావటంలేదు. విసుగూ, కోపం కూడా ఎక్కువే అయినాయి. ఎప్పుడూ ఏదో సాధిద్దామనే చూస్తున్నారు కానీ సఖ్యంగా అందరితో కలిసిపోవటంలేదు. సరే .... నిన్నటిదాకా కోడలుపిల్ల ఇంట్లో లేదు. దాన్ని తెచ్చేందుకు అబ్బాయి వెళ్లాడు. అయినా ఇంట్లో నేనూ, అమ్మాయీ తగలడ్డాం కదా .... ఎప్పుడైనా ప్రేమగా మమ్మల్ని పలకరించారా? లేదు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ మీరు బాధపడేది కాక మమ్మల్ని బాధపెడుతున్నారు. ఇప్పుడు ఏం కొంపలు మునిగాయని అలా ప్రవర్తిస్తున్నారు?'' అని అడిగింది సూటిగా.

రామ్మూర్తికి చిరాకనిపించింది. ఆవేశంగా ఏదో చెప్పబోయి, ఏం చెప్పాలో తోచక ఆగాడు. మెదడంతా ఖాళీ అయినట్టనిపించింది. మాటలు దొరికి మాట్లాడితేనే తప్ప ఆవేశం చల్లారదని తోచి "నా మనుమడిని నేను ఎత్తుకుంటే వాడికేమిటట బాధ? పైగా పిల్లవాణ్ణి ఎత్తుకుంటే నా ఒంటి వేడికి వాడు కాగిపోతాడని ఆరోగ్య సూత్రాలు చెబ్తాడా? వాడెంత, వాడి అనుభవం ఎంత? గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించిందట!'' అంటూ తలగడ దగ్గరున్న దిండును కాళ్లవేపూ, కాళ్లవేపున్న దిండును తలగడవేపూ మార్చి, ఇంకా శాంతించక దుప్పటి విదిలించి చక్కా మడతలు పెట్టాడు.

భర్తనే గమనిస్తూ కొంచెంసేపు చూసింది పార్వతమ్మ. అతడు దుప్పటిని మడతలుపెట్టి తలవేపు భద్రంగా పెట్టాక, నెమ్మదిగా అంది "ఓ..... అదా, వ్యవహారం! రిటైరయ్యాక మీకు చాదస్తం మరీ ఎక్కువైంది. అయినా వాడు అన్నదాంట్లో తప్పేముంది? పసివాళ్లను ఎత్తుకుంటే మన శరీరాల్లో ఉండే ఉష్ణం వాళ్ల శరీరాలకు వ్యాపిస్తుందన్నాడు. అది నిజమే కదా .... దానికింత బాధ, రాద్ధాంతం ఎందుకటా మరీనూ చోద్యం కాకపోతే!'' అంది పార్వతమ్మ పెదాలు విరుస్తూ.

రామ్మూర్తి మడతలు పెట్టిన దుప్పట్ని మళ్లీ విప్పదీశాడు. అమాంతం మంచంమీదకి వాలిపోయి నిండా కప్పుకుని అటువేపు తిరిగి పడుకున్నాడు.

"సంసారాల్లో ఇలాంటివన్నీ మామూలే! అంత పట్టింపు ఉంటే ఎలాగండీ?'' అంటూ అతడు కప్పుకున్న దుప్పటిని లాగింది పార్వతమ్మ.

"నన్ను ప్రశాంతంగా పడుకోనివ్వవా?'' ముసుగు తొలగించి కోపంగా చూస్తూ అడిగాడు.

"మీరు అలా ఉంటే ఏమిటోగా ఉంటుంది నాకు. లేవండీ, లేచి కొంచెం భోజనం చేసి పడుకోండి!'' బతిమాలే ధోరణిలో అంది పార్వతమ్మ.

ఆమె అలా భోజనం విషయం ఎత్తేసరికి ఆకలికి బింకం క్రమంగా సడలిపోతుంటే కప్పుకున్న దుప్పటిని దూరంగా విసిరికొట్టి లేచి కూర్చున్నాడు.

"పారూ!'' అని పిలిచి, భార్య కళ్లల్లోకి చూస్తూ, "ఏమిటో గానీ, సమస్యలన్నీ ఒకేసారి ముట్టడిస్తున్నాయి. ఆకలికి క్షణం కూడా ఆగలేకపోతున్నాను. వేళకు కడుపులో ఏదో ఒకటి పడకపోతే వికారంగా ఉంటోంది. వాంతి వచ్చినట్టూ, కళ్లు తిరిగినట్టూ ..... ఒకటే మంట కడుపులో. రేపయినా డాక్టరు దగ్గరకి వెళ్లి పరీక్ష చేయించుకోవాలి. షుగరు పెరిగిందని అనుమానం!'' అని దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడిచాడు రామ్మూర్తి.

పార్వతమ్మ కళ్లు ఆనందంతో మెరిశాయి. "ఆ వెళ్లేది ఏదో అక్కడికీ, ఇక్కడికీ కాకుండా మిషన్ ఆస్పత్రికే వెళ్లండి. మీరూ పరీక్ష చేయించుకోవచ్చు, అలాగే స్వామి విశ్వయోగానందులవారినీ పలకరించి, ఆశీర్వాదం పొంది రావచ్చు!''

"మిషనాస్పత్రికీ, స్వామీజీకి ఏమిటి సంబంధం?''

“పాపం .... వారూ పెద్దవారయ్యారు కదా! ఆరోగ్యం బాగాలేక మిషన్ ఆస్పత్రిలో చేరారని టీ.వీ.లో కూడా చెప్పారు” అంది పార్వతమ్మ.

రామ్మూర్తి ఎక్కడో ఆలోచిస్తూ కొంచెంసేపు మౌనం దాల్చాడు. స్వామి విశ్వయోగానందులవారి ఆలోచనలు గాయపడిన మనసుకు ఏదో లేపనం పూసినట్టూ, రోహిణి సెగలలో మలమలా మాడిపోతున్న దేహాలను అనూహ్యంగా ఎటువేపునుంచో వచ్చి శీతలపవనాలు స్పృశించి పరామర్శించినట్టూ , చలిలో గడ్డకట్టుకుపోతుంటే వడగాలి వీచినట్టూ .... అదే విచిత్రం!

ప్రకృతిసిద్ధంగా ఒనగూడిన శీతలపవనాలు, వడగాలీ ఒక దశలో వేధిస్తాయి. ఒక దశలో సుఖపెడతాయి. వేధించటమే ఋతుధర్మం. సుఖపెట్టడం ఎప్పుడో గానీ జరగని యాదృచ్ఛిక సంఘటన!

అలాగే మనిషిని ఆనందపెట్టేందుకు అమ్మతో ముడిపడిన గారాల బాల్యం; భార్యతో ముడిపడిన అందాల యౌవనం; సంఘంతో ముడిపడిన బతుకుతెరువు వ్యాపకం; పిల్లలతో ముడిపడిన జీవిత చరమాంకం .... ఇవికూడా ఒక దశలో హాయినిస్తాయి. ఒక దశలో ప్రతిబంధకాలుగా తోస్తాయి. ఒక ఆనందాన్ని ఆస్వాదించేందుకు మరో ఆనందాన్ని విస్మరించటం అనివార్యంగా మారింది. అలా దశలవారీగా కోల్పోయిన ఆనందాలన్నింటినీ నెమరువేసుకుంటూ ఒంటరి వేదన అనుభవించటం జీవిత చరమాంకపు విధిగా మారింది. అలా కుమిలిపోని మనిషి అంటూ ఉంటే అదీ ఒక యాదృచ్ఛిక సంఘటనే; పసివాళ్లూ, శవాలూ తప్ప!

ఊహ తెలిశాక అనుభవించిన ఆనందాల్లో కూడా అంతా యాంత్రికతే! అనుభవించే దశలో వాటి ప్రాముఖ్యాన్ని వాస్తవ దృష్టితో గ్రహించం కనుకనే మరో దశలో అవి విస్మృతమవుతున్నాయి. చెయ్యి జారిపోతేనే వెంపర్లాట. జారిపోకపోతే ముఖం మొత్తుతాయి. నిర్లక్ష్యానికి గురవుతాయి.

‘ఆస్పత్రికి వెళ్లినప్పుడు తప్పకుండా స్వామీని కలవాలి. సత్యశోధనలో ఒక జీవితకాలాన్ని సర్వసుఖాలనూ త్యజించి వెచ్చించిన ఆ పుణ్యపురుషుడి సందేశం వినాలి. ఆశీర్వాదం పొందాలి. జీవనసంధ్యలో ఇలా అశాంతికి గురికాకుండా ఉండాలంటే అదే తారకమంత్రం’ అనుకున్నాడు రామ్మూర్తి మనసులోనే.

“ప్లీజ్, భోజనానికి లేవండీ!” మళ్లీ అభ్యర్థించింది పార్వతమ్మ.

రామ్మూర్తి మంచంమీంచి లేవబోయాడు. అంతలోనే ఆలోచించాడు. పిలవంగానే భోజనానికి వెడితే ఎంత చులకనగా ఉంటుంది!

“పారూ! భోజనం చేస్తాను గానీ నువ్వు నాకొక్క హామీ ఇస్తావా?” అడిగాడు రామ్మూర్తి.

“ఏమిటో?”

“కుటుంబంలో నాకు వెనుకటి ప్రాధాన్యం తిరిగి వచ్చేటట్టు చేస్తావా?”

పార్వతమ్మ సమాధానం చెప్పకుండానే, “భోజనం వడ్డిస్తాను, రండి!” అని చెప్పి వంట గదిలోకి వెళ్లిపోయింది. రామ్మూర్తి కూడా ఆమె వెంటే భోజనానికి వెళ్లాడు.

‘ఆకిలికి ఉండగలిగితే ఇవాళ చచ్చినా అన్నం తినేవాణ్ని కాదు. ఈ వెధవ షుగరు వ్యాధీ ....’ అని తనలో తనే ఏమిటో గొణుక్కుంటూ.

***

రామ్మూర్తి ఆస్పత్రికి వెళ్లేందుకు పొద్దున్నే బయలుదేరాడు. కేవలం ఆరోగ్య పరీక్షలకే అయితే అంత త్వరగా తెమిలేవాడు కాదేమోగానీ, స్వామి విశ్వయోగానందులవారిని దర్శించేందుకు ఆత్రుతపడుతున్నాడు.

పార్వతమ్మ మఫ్లర్ తెచ్చి భర్త భుజంమీద వేలాడేసింది.

“స్వామివారిని తప్పకుండా కలుస్తారు కదూ?” అని అడిగింది ఆసక్తిగా.

“ఓ.... సహం వెళ్తోంది వారికోసమే!” అన్నాడు రామ్మూర్తి.

“మన మనుమడు అమావాస్య, ఆదివారం ఉదయం పది గంటలకు పుట్టాడు. నక్షత్రం ఏమిటో గుర్తు లేదు. పుట్టిన తేదీ మీకు తెలుసు కదా ... స్వామివారికి చెప్పండి. వాడి జాతకఫలం ఎలా ఉందో కనుక్కోండి. ఎవరో చెప్పారట, వాడికి ఆదాయం వచ్చే జనవరిదాకా సున్నా అనీ, వ్యయం అధికం అని. అలాగే పూజ్యం అధికమనీ, అవమానం సున్నా అనీ, ఎందుకైనా మంచిది నిజమో, కాదో కనుక్కోండి. ఏవైనా గ్రహశాంతులు చేయిస్తే ఆదాయం సున్నాకు ముందు అంకె పడే అవకాశం ఉందేమో అడగండి!”

“పారూ! పొత్తిళ్లబిడ్డకి ఎన్ని గ్రహశాంతులు చేయించినా ఆదాయం అంతకుమించి పెరగదేమో ఒక్కసారి ఆలోచించు!” అన్నాడు . రామ్మూర్తి.

“మధ్యలో మీ చాదస్తం ఎందుకూ? ఎటూ వెళ్తున్నారు కదా ... స్వామివారిని అడగండి. పనిలో పని. మన శ్రీవాత్సవకు ప్రమోషను ఎప్పుడు వస్తుందో, అమ్మాయి సువర్చల చదువు ఎలా సాగుతుందో కూడా తెలుసుకోండి!” అని చెప్పి,



## సఫారీకి ఫన్ - పులికి ఫుడ్!



సఫారి పార్క్ అంటే ఇలాంటి వాన్‌లో వెళ్తూ, చుట్టుపక్కల ఉన్న క్రూరమృగాలను చూడటం నెప్రతా జూ పార్క్‌తో సహా మనందరికీ ఇంతవరకే తెలుసు.

కానీ జపాన్‌లోని టోక్యోలో ఓ సఫారి పార్క్ నిజమైన థ్రిల్ నందిస్తోంది. పూర్తి రక్షణగల కారులో సందర్శకులు వెళ్తూ ఓ చోట ఆపితే, మూడు పులులు కారు ఆగీ ఆగగానే దానిమీదకి దాడిచేసి లోపలి సందర్శకులకి థ్రిల్‌నీ, భయాన్ని కలిగిస్తాయి. ఈ కారుమీద వాటి ఆహారం ఉంచి ఇలా దాడిచేయడం అలవాటు చేశారు. అయితే ఈ కారులో పన్నెండేళ్ల లోపు పిల్లల్ని అనుమతించరు. అలాగే ఏడు నెలలు దాటిన గర్భవతులను, హృద్రోగులను కూడా. వాటి మాంసం ఖరీదు రుసుముగా చెల్లిస్తే చాలు!

-డి. పద్మజ

ఆయాసంతో సన్నగా రొప్పుతూ నిల్చుంది పార్వతమ్మ.

రామ్మూర్తి సందేహిస్తూనే ఎందుకో ఒక్క క్షణం ఆలోచించి, "పారూ! స్వామీజీ అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నారు కదా! ఇన్ని ప్రశ్నలు అడిగి వారిని వేధించటం బాగుంటుందంటావా?" అని అడిగాడు.

"బాగో ... ఓగో ...! అలా అన్నింటికీ మొహమాటపడితే పనులెలా సానుకూలమవుతాయి? ఇక కదలండి! నేను ముందుగా వీధిలోకి వెళ్లి ఎదురొస్తాను. అంతా శుభమే జరుగుతుంది!" అంది పార్వతమ్మ.

ఇద్దరూ కలిసి హాల్లోకి వచ్చారు. సువర్చల సోఫాలో కూర్చుని దీక్షగా ఏదో పుస్తకం చదువుతూ కనిపించింది హాల్లో! దగ్గరకి వెళ్లి "ఏం చదువుతున్నావ్? అయినా సరస్వతీ దేవివంటి పుస్తకాన్నలా పాదాలమీద పెట్టుకుని చదివితే ఇక నీ ముఖానికి ఎలా వస్తుందే చదువు? ఛీ! ఛీ! జనరేషన్ పాడైపోతోంది!" విసుక్కున్నాడు రామ్మూర్తి.

సువర్చల పుస్తకంలోంచి పాములా 'పడగ' ఎత్తింది. రామ్మూర్తివైపు కొరకొరా చూస్తూ "ఎద్దంటి పుస్తకాన్ని న్యూస్ పేపర్లా చేతుల్లో పట్టుకుని చదవటం నా వల్ల కాదు, బాబూ! పాదాలమీదా, తొడలమీదా పెట్టుకోకుండా ఇంత పెద్ద గ్రంథాలు చదవాలంటే వ్యాసపీఠం చేయించండి. మీ ఇష్టప్రకారమే కొన్ని దశాబ్దాలు వెనక్కు వెళ్తాను!" అంది ఎకసక్కెంగా.

"కన్న తండ్రిని పట్టుకుని అంతలేసి మాటలు అంటావే నువ్వు? ఆయన మాత్రం ఏమన్నారూ .... పుస్తకం కాళ్లమీద పెట్టుకోవద్దమ్మా అన్నారు. ఏమి చదువుతున్నావు? అని మురిపంగా అడిగారు. అంతమాత్రానికే అలా పేలాలు వేగాలా? పైగా వారు వెళ్తోంది మీ అందరి మంచికోసం స్వామీజీ దగ్గరికి!" అంటూ కూతుర్ని మందలించింది పార్వతమ్మ.

సువర్చల అంతటితో ఆగలేదు. పుస్తకాన్ని విసురుగా మూసివేసి, సోఫామీదకి విసిరికొట్టి, "ఏం చదువుతున్నానో చెప్తే మాత్రం ఆయనకు ఎలా అర్థమవుతుంది? చైత్రమూ, జేష్ఠమూ, ఆషాఢమూ, పుష్యమూ అంటూ చదివే మీ కాలపు చదువులు కావు మావి! మా కంప్యూటర్ చదువు గురించి ఎలా చెప్పాలి ఆయనకు? అయినా రిటైరయ్యారు కదా? హాయిగా ఆ టీ.వీ.లో ప్రోగ్రాములు చూస్తూ, వేళకింత తిని తొంగోక అన్నీ తనకే కావాలంటారు. అంతగా ఆయనకు ఉబుసుపోకపోతే నా పుస్తకాలకు అట్టలు వెయ్యమను. పేర్లు రాయమను. అంతే కానీ, ఇలా నా టైమ్ వృథా చెయ్యద్దని చెప్పు!" అంటూ లేచి వెళ్లి టీ.వీ. పెట్టుకుని కూర్చుంది.

హతాశుడై అక్కడే సోఫాలో కూలబడిపోయాడు రామ్మూర్తి.

కొద్ది క్షణాల మౌనం తర్వాత భర్త పక్కనే సోఫాలో కూర్చుంది పార్వతమ్మ. "చెబ్తినే .... ఈమధ్య మీరు ప్రతి చిన్న విషయానికీ అమితంగా చలించిపోతున్నారు. అమ్మాయి చెప్పింది కూడా వాస్తవమేగా! సర్దుకుపోవాలి మనమే!" అంది అనునయంగా.

రామ్మూర్తి దీర్ఘంగా నిట్టూర్చాడు. బేలకళ్లతో భార్యవేపు చూస్తూ "నిజమేనోయ్, పారూ! అది అన్నదాన్లో అక్షరం కూడా అబద్ధం కాదు. కానీ దాని మాటలు చాలా అప్రియంగా ఉన్నాయి. వాస్తవాలను చెప్పే తీరు అలాగే ఉండాలంటే 'నేను చచ్చిపోతాను' అంటే మీకు ఎలా ఉంటుందో ఆలోచించు. మనందరమూ చచ్చేది వాస్తవమే. అయినా ఆ వాస్తవాన్ని చెప్పుకోము, అప్రియంగా అనిపిస్తాయి కనుక...!"

"ఏమిటండీ ఆ మాటలు?" అంది పార్వతమ్మ.

రామ్మూర్తి చిరునవ్వు నవ్వాడు. ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు.

పొద్దున్నే ఏదో పనిమీద బజారుకు వెళ్లిన శ్రీవాత్సవ హడావుడిగా ఇంటికి వచ్చాడు. చేతినిండా ఏవో పాకెట్లూ, ముఖంనిండా చిర్నవ్వులూ...

"హాయ్ గీతా!" అని భార్యను హాల్లోంచే కేక వేసి పిలిచి, ఆమె హాల్లోకి రాగానే "మన అబ్బాయి పుట్టిన వేళా విశేషం బాగుందోయ్! నాకు ప్రమోషన్ వచ్చిందట! బజారులో మా ఆఫీసరుగారు కలిసి చెప్పారు!" అంటూ కారీబాగ్‌లోంచి పూలు తీసి సహం భార్యకు, సహం సువర్చలకూ స్వహస్తాలతో అందించాడు. స్వీట్ల పాకెట్టు తీసి పార్వతమ్మ చేతిలో పెట్టాడు. రామ్మూర్తి ముఖంలోకి అదోలా చూసి తల దించుకుని నిల్చున్నాడు.

కొడుకు అలా తనముందు నిస్సహాయంగా నిల్చుంటే రామ్మూర్తికి చాలా సంతోషమనిపించింది. వెధవ దగ్గర అప్పటికే డబ్బులు అయిపోయి ఉంటాయి. అందుకే నాకు కనీసం ఒక సిగరెట్టు పాకెట్టయినా తెచ్చిపెట్టలేదు. ఆ న్యూనతతో క్రుంగిపోతూ తల వంచుకుని వాడలా నిల్చుంటే ఎంత బాగుంది! అలా కాకుండా వాడు సిగరెట్టు పాకెట్టు కొని తెచ్చి నాకు ఇస్తూ గర్వంగా చూసి ఉంటే ఎంతగా కంపరమెత్తేదో, ఒళ్లంతా!' అనుకున్నాడు రామ్మూర్తి.

"పోన్లేరా .... అబ్బాయ్! నువ్వేదో ఖయాల్లో పడి నా మాట

మరిచేపోయి ఉంటావు. అందుకే నాకు సిగరెట్లు తీసుకురాలేదు. అది సరే కానీ, ఇంతకూ ప్రమోషనంటే జీతం ఎంత పెరిగిందేమిటి?" అని అడిగాడు.

దూది పరుపులోంచి సూదిలా లేచింది పార్వతమ్మ. "ఇది మీ కాలం కాదులెండి! ఎన్నిసార్లు పడ్డాను మీతో అవస్థ! ఐదో పదో జీతం పెంచి ప్రమోషన్ అంటూ మారుమూల ఊళ్లకు బదిలీ అయ్యేవారు. పొలోమంటూ పిల్లా జెల్లలతో సామాన్లు చంకనేసుకుని తిరగలేక చచ్చేదాన్ని! మన అబ్బాయికి ప్రమోషన్ అంటే మీలా ఉండదు. వందల్లో జీతం పెరుగుతుంది. ఉన్న చోటనే ఉద్యోగం ఉంటుంది గానీ బదిలీలు అంత దూరం ఉండవు; బ్యాంకు ఉద్యోగి కదా!" అంటూ దీర్ఘం తీసింది కించిత్తు గర్వంగానే.

రామ్మూర్తి కిక్కురుమనలేదు.

"అదికాదు, నాన్నగారూ! మీ సిగరెట్ల విషయం గుర్తుంది నాకు. అయినా తీసుకుని రావాలనిపించలేదు. మీరు సిగరెట్లు మానేస్తే ఎంత ఆదా అవుతుందో తెలుసా? పైగా హాని మీ ఒక్కరికే కాదు, పొగ తాగేవాళ్లకన్నా పక్కనున్నవాళ్లకే ఎక్కువ హాని అట. పైగా, ఇంట్లో చంటాడున్నాడు!" అన్నాడు శ్రీవాత్సవ.

"నిజమేనండోయ్! అలా విన్నాను నేను కూడా ...!" అంటూ పార్వతమ్మ కొడుక్కు వత్తాసు పలికింది.

"హారి భడవా! నేను ఉద్యోగంలో ఉన్నప్పుడు, నువ్వు ఉద్యోగంలో లేనప్పుడూ సిగరెట్లు తెమ్మని పెద్ద కాయితం ఇస్తే, చిల్లర డబ్బులు నొక్కేందుకు ఎంత ఉత్సాహంగా ఉరికేవాడివి! మీ అమ్మ కూడా ఆత్రంగా తొంగి చూసేది నీకు నేనిచ్చిన కాయితం ఎన్ని రూపాయలదో? అని. పెద్ద కాయితం అయితే అబ్బాయికి ఎదురు వెళ్లి మిగిలిన డబ్బులు తాను నొక్కేసేది. అలా నొక్కిన డబ్బంతా పట్టు చీరల మడతల్లో దాచేది. అది దానికి అవసరమై కాదు; అలవాటు! అది మహా ఖర్చుపెడితే పక్కింటి పండరీబాయి కొత్తరకం వెండిపట్టీలు కొన్నప్పుడో, సికాకొల్లి సీతమ్మ స్టీలుబిందెలు, చౌదరిగారి భార్య అరిసెల గంటెలూ కొన్నప్పుడు వాళ్లతో పోటీకి దిగి కొనేదే తప్ప, అవసరమై కానే కాదు. అన్నీ నేనే సమకూరుస్తుంటే ఇక దానికి డబ్బుతో అవసరం ఏముంటుంది? నెయ్యిదిబ్బలో మిగిలింది కప్పిపెట్టి దాచే కుక్క బుద్ధి అది!'

"ఏమిటండీ, ఆలోచిస్తున్నారు? ఇక తెమిలి వెళ్లండి! స్వామీజీ త్వరగా ఆహారం ఆరగించి విశ్రాంతిలోకి వెళ్లిపోతారేమో! వాళ్లు మనకుమల్లే వేళాపాళా లేకుండా అర్ధరాత్రులు, అపరాహ్ణాలూ భోం చెయ్యరు!" హెచ్చరించింది పార్వతమ్మ.

రామ్మూర్తి కదల్లేదు. పదే పదే ఆమె స్వామీజీ దగ్గరికి వెళ్లమని అదేపనిగా హెచ్చరిస్తుంటే, వెళ్లాలని మనసులో ఉన్నా ఆమె చెప్పటం ఆపిన తర్వాతనే వెళ్దామని మనసులో నిర్ణయించుకున్నాడు. వెళ్లమని ఆమె అంతగా పోరకాడుతున్నా తన ఆరోగ్యాన్ని గురించి కానీ, భర్త భవిష్యత్తు గురించి కానీ స్వామివారిని అడగమని ఒక్క మాటా చెప్పలేదు; ఎంతకూ పిల్లల విషయం, మనుమడి విషయం తప్ప!

పార్వతమ్మ అంతగా బైటపడి అనటంలేదు కానీ, ఆమె ఆరోగ్యం కూడా అంతంతమాత్రంగానే ఉంది. 'మీకు చెప్పి బాధపెట్టడం ఎందుకు గానీ, ఒంట్లో అసలు బాగుండటంలేదండీ! నడుము నొప్పి ఈ మధ్య ఎక్కువైంది. అరికాళ్లు ఒకటే మంట. సాయంకాలం అయిందంటే వికారంగా ఉంటోంది. ఈ వయసులో ఇలాంటివి సహజమే అయినా, ఇంత తీవ్రంగా ఉండటం నా ప్రారబ్ధం!' అంటూ ఎన్నిసార్లు భర్త దగ్గర వాపోయిందో!

రామ్మూర్తికి ఆ క్షణంలో భార్యమీద విపరీతంగా అభిమానం పొంగుకొచ్చింది. తలెత్తి చుట్టూ చూశాడు. కొడుకు, కోడలు, సువర్చల ఎవరూ హాల్లో లేరు. ఎప్పుడో దూరంగా వెళ్లిపోయారు.

"పారూ!" అంటూ ఆర్ద్రంగా పిలిచాడు రామ్మూర్తి.

"ఏమిటి?" అంది.

"నేను కూడా నిన్ను గురించి అంతగా పట్టించుకోవటం లేదు కదూ?"

ఆమె అదోలా మూలిగింది. "అంతా అయిపోయాక ఇప్పుడు పట్టించుకుని మాత్రం ఆర్చేదా, తీర్చేదా! మీరు రిటైరు కాకముందే మన ఇంటిమీద పోర్షన్ వేయిస్తే బాగుండేది. నాకింత బాధ ఉండేది కాదు. ఇంటిని అన్ని హంగులతో అద్దంలా తీర్చిదిద్ది పిల్లలకు అప్పగిస్తే 'కృష్ణా రామా' అనుకుంటూ ఊరిబయట చెట్టుకింద శేషజీవితం గడిపినా మనల్ని ఎవ్వరూ అడిగేవాళ్లు ఉండేవారు కాదు....!"

"ఇప్పుడు మాత్రం మించిపోయింది ఏముంది? ఈ క్షణాన ఇద్దరం వెళ్లి ఊరి బయట చెట్టుకింద ఉన్నా ఎవ్వరూ అడగరు. ఆ పూచీ నాది!" అన్నాడు మధ్యలోనే రామ్మూర్తి.

పార్వతమ్మ చాలా తిరస్కారంగా చూసింది. "చాల్లెండి మీ చాదస్తం!

## ఈరోజు హోటల్



**హో**టల్ వ్యాపారంలో అమెరికాలో కొత్తపుంతలు తొక్కుతున్నారు. కస్టమర్స్‌ని ఆకర్షించడానికి ఆడ వెయిటర్స్, ఖరీదైన ఇంటీరియర్ డెకరేషన్, లైట్ మ్యూజిక్‌లు ఇంతదాకా ఉన్న మార్గాలు.

లాస్ ఏంజెలెస్‌కి చెందిన నికిమోరీనా అనే వ్యాపారి ఓ కొత్త తరహా రెస్టారెంట్‌ని తెరిచాడు. 'టుడేస్ హోటల్'(ఈరోజు హోటల్) అనే పేరు గల దీంట్లోకి కేవలం లేడీ కస్టమర్స్‌నే అనుమతిస్తారు. వెయిటర్స్ అంతా మగాళ్లే. వాళ్ల సగటు వయసు 19. ఆర్డర్ తీసుకున్నాక వాళ్లకి సర్వ్ చేసేలోగా వాళ్ల దగ్గరకి వెళ్లి ప్రేమగీతాలు పాడతారు ఆ కుర్రకారు వెయిటర్స్ పదహారు ఏళ్లనుంచి 84 ఏళ్ల వయసుగల అనేకమంది ఆడ కస్టమర్స్‌తో ఈ హోటల్ ఎప్పుడూ కళకళలాడుతూంటుంది.

-డి. పద్మజ

ఉద్యోగంలో ఉన్నంతకాలం కన్నూ మిన్నూ గానకుండా చక్రం తిప్పారు. తీరా ఇప్పుడు కేవలం పెన్షనే ఆధారం కాగానే చెల్లకిందా, చేమలకిందా ఉందామంటున్నారు. నిజమే! అధికారం అంతరించాక ఎవరి తత్త్వమైనా అలాగే ఉంటుంది. మీరు అందుకు అతీతులేమీ కారు కదా!" అంటూ మూతి విరిచింది. నడుంమీద చేతులు వేసుకుంది.

ఆమెతో వాదించి ప్రయోజనం లేదనుకున్నాడు రామ్మూర్తి. నెమ్మదిగా సోఫాలోంచి పైకి లేచాడు. చెప్పుల స్టాండు దగ్గరికి వెళ్లి చెప్పుల్ని పాతగుడ్డతో దులిపి వేసుకున్నాడు.

పార్వతమ్మ హడావుడిగా లేచి వెళ్లి, వీధి వాకిట దగ్గర నిలబడి, "మీరు ఒక్క నిముషం ఆగి బయలుదేరి వీధిలోకి రండి! నేనలా ముందుగానే వెళ్లి ఎదురొస్తాను!" అని చెప్పి, మెట్లు దిగి వెళ్లిపోయింది.

రామ్మూర్తి వాకిట్లోకి వెళ్లి నిల్చున్నాడు. గడప మెట్లమీంచి వీధిలోకి తొంగి చూశాడు. గడ్డి లారీ వెళ్తుంటే దాన్ని తప్పించుకుని మరికొంచెం దూరం ముందుకు వెళ్లి వెనక్కు తిరిగి చూసింది పార్వతమ్మ.

బయలుదేరేందుకు సిద్ధంగా వాకిట్లో కనిపించాడు రామ్మూర్తి.

'ఇక రండి!' అన్నట్టు చెయ్యి పైకి ఎత్తి గాలిలో ఊపుతూ పిలిచింది.

రామ్మూర్తి మెట్లు దిగాడు. ఈవైపు నుంచి అతనూ, ఆ వేపు నుంచి పార్వతమ్మ ఎదురు బోదురుగా నడవసాగారు.

అంతలోనే పక్కగొందిలోంచి హఠాత్తుగా వచ్చి, రామ్మూర్తి చెయ్యిని తన చేతిలో ఇరికించుకుని, "మీ కోసమే వస్తున్నాను!" అంది రిటైర్డ్ పంతులమ్మ రాజ్యలక్ష్మి.

ఆ సంఘటనకు నిర్ఘాంతపోతూ పలుపుగుండలా అక్కడే నిలబడి కొంచెం ఆలస్యంగా ఎదురు వచ్చిన భార్యవేపు ఇబ్బందిగా చూశాడు.

"మన పార్కు స్నేహితుడు సుబ్బారావుగారు ఆత్మహత్యా ప్రయత్నంలో పురుగుమందు తాగారు. భగవంతుడి దయ వల్ల అది రైతులను మోసగించే కల్తీ మందు కావటంతో ఇంకా చావకుండా కొనప్రాణంతో ఆస్పత్రిలో కొట్టుకుంటున్నారు!" అని చెప్పింది రాజ్యలక్ష్మి.

రామ్మూర్తి ఉలిక్కిపడి చూశాడు.

"అవును. అది తెలిసి వేణుగారు ఆస్పత్రికి వెళ్లారు. అలాంటి స్థితిలో సుబ్బారావుగారిని చూసి ఫెయింట్ అయ్యారు. వారిని కూడా ఆస్పత్రిలో చేర్చుకుని వైద్యం చేస్తున్నారు. ఈ విషయం మీకు చెప్పి ఆస్పత్రికి తీసుకువెళ్లాలనే వచ్చాను!" అందామె.

"విషం కాదు కదా?" అడిగాడు.

అంత బాధలో కూడా ఆమె ముఖం ప్రసన్నంగా వెలిగింది. గోముగా నవ్వుతూ, "వెళ్దాం పదండి!" అంది ఎంతో చనువుగా.

మౌనంగా నిల్చున్న భార్యకు ఆమెను పరిచయం చేసే అవకాశమే కలగలేదు రామ్మూర్తికి. పార్వతమ్మ ఆమెవేపూ, భర్తవేపూ ఒక్క క్షణం ఎగాదిగా చూసి రుసరుసలాడుతూ ఇంట్లోకి వెళ్లిపోయింది.

భార్య అలా వెందుకు వెళ్లిందో గ్రహించాడతను. గుండె గుభేలుమంది.

"వాళ్లుంది ఏ ఆస్పత్రిలో?" అని అడుగుతూ, ఇంకా తన చేతిని విడిచిపెట్టకుండా పట్టుకునే ఉన్న రాజ్యలక్ష్మి చేతిని సుతారంగా విడిపించుకున్నాడు.

"సెయింట్ మేరీ హాస్పటల్ .... మిషనాస్పత్రి అంటారే ..... అది!"

"వెళ్దాం, పద!" అంటూ ముందుకు కదిలాడు రామ్మూర్తి.

ఇద్దరూ కొంచెం దూరం వెళ్లాక "ఆ ఆసుపత్రి ఎక్కడో ఊరి బయట కొండగుట్టల్లో ఉంది. ఎలా వెళ్దాం?" అడిగింది రాజ్యలక్ష్మి.

"ఆటోలో!" అన్నాడతను.

దారిలో ఎదురైన ఖాళీ ఆటోను పిలిచి ఎక్కి కూర్చున్నారు. వెళ్లవలసిన అడ్రసు చెప్పారు. ఆటో వేగంగా వెళ్తోంది.

"మన సుబ్బారావు ఇంత పిచ్చిపని ఎందుకు చేసినట్టూ?" దారిలో అడిగాడు రామ్మూర్తి.

"పిచ్చివాడు కనుక!" అంది రాజ్యలక్ష్మి.

"వేణు సర్వీసులో ఇలాంటివి ఎన్నో చూసి ఉంటాడు. అలాంటిది అతను ఫెయింట్ కావటం విచిత్రంగా ఉంది కదూ!"

"వృత్తికీ, ప్రవృత్తికీ పొంతన ఉండదు చాలామంది విషయంలో. అతను పోలీసు శాఖలో పనిచేసినంత మాత్రాన రాతిగుండె ఉండి తీరాలా?"

ఇద్దరూ ఇక మౌనంగా కూర్చున్నారు. ఆటో ఊరు దాటి, కలుషిత వాతావరణాన్ని దాటి పచ్చటి చెట్లమధ్య నుంచి వెళ్తోంది. స్వచ్ఛమైన చిరుగాలి కెరటాలు విడతలవారీగా తేలివస్తూ శరీరాలకు తాకుతుంటే చాలా హాయిగా ఉంది, బరువెక్కిన హృదయాలు తేలికపడుతున్నాయి!

"బాధకు నిర్వచనం ఏమిటో చెప్తావా, రాజీ!" అడిగాడు అతను ఎక్కడో ఆలోచిస్తూ.

"సహజమా, అసహజమా? అవకాశం ఉందా, లేదా అన్నది మన చిత్త ప్రవృత్తిని బట్టీ, కాంక్షను బట్టీ కాకుండా వాస్తవ దృష్టితో ఆలోచించకుండా ఏదో పొందాలనీ, పొందింది పోగొట్టుకున్నామనీ కలిగే మానసిక వికారమే బాధ, ఆవేదన!"

"వాటికీ శాశ్వతత్వం లేదా? సుబ్బారావుగారి వార్తతో కలతపడిన నా మనసు ఈ చల్లగాలికి హాయిగా కుదురుకుందేం!"

"గుర్తించంగానీ ప్రకృతి సిద్ధంగా మనకు ఒనగూడిన సౌఖ్యాలు అవే కదా! ఇక శాశ్వతత్వం అంటారా .... ప్రకృతికి తప్ప అది దేనికీ లేదు. కాలం ప్రతిదాని సాంద్రతనూ తగ్గించేస్తుంది!" చెప్పింది రాజ్యలక్ష్మి.

ఆటో ఆస్పత్రి ముందు ఆగింది. ఇద్దరూ కిందికి దిగారు. మీటరు చూసి, ఇవ్వవలసిన బాడుగ తేల్చుకున్నారు.

"ఆటో ఛార్జి మీరు చెల్లించటమే ధర్మం!" అంది రాజ్యలక్ష్మి గోప్యంగా నవ్వుతూ.

"ఇలాంటివి పురుషాధిక్యం కిందికి రావు కదా?" అని అడిగి, తనూ నవ్వుతూ ఆటోవానికి బాడుగ చెల్లించాడు రామ్మూర్తి.

ఇద్దరూ ఆస్పత్రిలోకి వెళ్లారు. మెట్లు ఎక్కి, మొదటి అంతస్తులో ఉన్న జనరల్ వార్డులోకి ప్రవేశించారు. మంచాలమీద ఉన్న రోగులను పరీక్షగా చూస్తూ, అయిదారు మంచాలు దాటి వెళ్లగానే, "హాయ్ రామ్మూర్తిగారూ!" అని పిలిచాడు ఆరవ మంచంమీద, తొడలదాకా దుప్పటి కప్పుకుని కూర్చున్న వేణు.

ముఖాలు విప్పార్చి రామ్మూర్తి, రాజ్యలక్ష్మి అతడి మంచం దగ్గరకు వెళ్లారు. రామ్మూర్తి మంచంమీద కూర్చున్నాడు. రాజ్యలక్ష్మి స్టూలుమీద కూర్చుంది.

"బాగున్నారా వేణుగారూ?" అడిగాడు రామ్మూర్తి.

"బాగానే ఉన్నాను. ఏమిటో, అలా సుబ్బారావుగారిని చూడగానే అమితంగా బాధనిపించింది. అది అతడిపట్ల అభిమానమో, మానవ సంబంధాల పట్ల నాలో ఉన్న గౌరవమో కారణం - అలా నేను ఫెయింట్ కావడానికి అనుకున్నాను. మందులు మింగి, ఇంజక్షన్లు పొడిపించుకుని, నాలుగు సెలైన్ సీసాలు నరాల్లోకి ఎక్కించుకున్నాక మళ్లీ మామూలు మనిషిని అయ్యాను. అయినా చావు అంచులదాకా వెళ్లి వచ్చాను కదా .... ఆలోచనా విధానంలో వెనుకటి కాపట్యం లేదు! రిజర్వేషన్స్ లేవు! ఇప్పుడు తోచింది కదా .... మానవ సంబంధాల పట్ల నాకు గౌరవమే

అంతర్లీనంగా అయినా ఉండి ఉంటే ఆనాడు అధికారంలో ఉన్నానన్న అహంతో టీకొట్టు ఆశీర్వాదాన్ని లాఠీతో కొట్టేవాడినే కాదు!

"ఇక సుబ్బారావుగారిమీద అభిమానం అన్నది మాత్రం ఎంతవరకు నిజం? వెనుకటికి ఒక వృద్ధ రాజకీయ నాయకుడు చనిపోతే ఆ కబురు అంది పొరుగు ఊరిలో ఉన్న అతగాడి అక్కగారు మిట్టమధ్యాహ్నం ప్రయాణం చేసి వెళ్లారట. అసలే రోహిణికార్తె. రోళ్లు పగిలే ఎండా, వడగాలి! మంచుగడ్డల మధ్య భద్రపరిచిన తమ్ముడి శవాన్ని చూసి ఆమె భోరున ఏడ్చింది. మంచుగడ్డలమీదికి వాలిపోయింది. ఒగుడాకులా ఉన్న ఎనభై ఏళ్ల వృద్ధురాలు చావు కబురు వినటం, ఎండలో, వడగాలిలో ప్రయాణం చేసి రావటం, రాగానే మంచుగడ్డల మీద వాలటంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది; గుండె ఆగి! 'అక్కా తమ్ముళ్ల అనుబంధం' అన్న శీర్షికతో పత్రికలో ఆ సంఘటనను గురించి ఎలా రాస్తే జనానికి వింతగా అనిపిస్తుందో అలా రాశారు కానీ, ఆమె శరీర దౌర్బల్యం, వయసు, వాతావరణం చావుకు కారణమన్న విషయం రాయలేదు!

"అలాగే సుబ్బారావుగారి విషయంలో నేను ఫెయింట్ కావటానికి కారణం నా ఆరోగ్యం, వయసు, శారీరక దౌర్బల్యమే తప్ప ప్రేమలూ, అభిమానాలూ కారణం కానేకావు!" అని చెప్పి, వింతగా నవ్వారు వేణుగారు.

"మన సుబ్బారావు గారు ఎలా ఉన్నారు? ఎక్కడున్నారు?" అడిగాడు రామ్మూర్తి.

"ప్రాణగండం లేనట్టే. తాగిన కల్తీ మందు కూడా కక్కించారు. ఎమర్జన్సీ వార్డులోంచి ఇంకొంచెం సేపట్లో ఇక్కడికే తెస్తారు!" చెప్పాడు వేణు.

"ఇక్కడ స్వామి విశ్వయోగానందుల వారు ...."

"వారా ....! మూత్రపిండాల వ్యాధితో వచ్చారు. వృద్ధాప్యం కదా! అదీ కాక బి.పి., షుగరూ ఇత్యాదివి మామూలే! గుండెకు కఫం ఎగదన్నీ పాపం .... శ్వాస కూడా పీల్చుకోలేకపోతున్నారు. ఇంతకు ముందే నేను వెళ్లి చూసి వచ్చాను. మీరు కూడా వెళ్తే వెళ్లిరండి; స్పెషల్ వార్డులో ఉన్నారు. ఉన్న చిక్కల్లా వారు మౌనవ్రతం పాటిస్తున్నారు!" చెప్పాడు వేణు.

"మరి జీవిత సమస్యలు వారికి చెప్పుకుని, పరిష్కారాలు తెలుసుకోవటం ఎలా?"

"పలకా, బలపం పక్కనే పెట్టుకున్నారు!"

రామ్మూర్తి లేచి నిల్చున్నాడు. "సుబ్బారావుగార్ని వార్డులోకి తెచ్చేలోగా నేను వెళ్లి స్వామీజీని కలిసి వస్తాను!" అని వేణుకు చెప్పి రాజ్యలక్ష్మి వేపు చూశాడు రామ్మూర్తి. అప్పటికే ఆమె అతడి వెంట వెళ్లేందుకు సిద్ధంగా నిలబడి ఉంది.

ఇద్దరూ జనరల్ వార్డులోంచి మంచాలు దాటుకుంటూ మూలగా ఉన్న స్పెషల్ వార్డులోకి వెళ్లారు. స్వామీజీకి సపర్యలు చేస్తున్న కాషాయాంబరధారీ, పాతికేళ్ల కుర్రవాడూ వాకిట్లోకి ఎదురు వచ్చి వాళ్లను లోనికి ఆహ్వానించాడు.

రామ్మూర్తికి బాగా తెలుసు. స్వామీజీ ఆరోగ్యంగా ఉన్న రోజుల్లో ఆశ్రమానికి వెళ్లి వారిని దర్శించుకోవటం ఎంత కష్టంగానూ, మహద్భాగ్యంగానూ ఉండేదో! ఎప్పుడూ రాష్ట్రపతులూ, మంత్రులు, పార్లమెంటు సభ్యులు, విదేశీ వి.ఐ.పీ.లూ ....

రామ్మూర్తి భక్తిపారవశ్యంలో తేలిపోతూ స్వామీజీవేపు ఆరాధనగా చూశాడు. వారి స్థూల శరీరం చిక్కి శల్యమై కనిపించింది. కైవల్య ప్రాప్తికోసం సూక్ష్మశరీరం సమాయత్తమవుతున్నట్టుంది. కఠోర బ్రహ్మచర్యంతో కండలు తిరిగిన కంచుదేహం ఇప్పుడు దూది బొమ్మలా మారి తోళ్లు వేలాడుతూ ... లోతుకు పీక్కుపోయిన కళ్లూ .... గుంటలు పడిన బుగ్గలూ ....

రామ్మూర్తికి కన్నీళ్లు ఆగలేదు. దుఃఖం తన్నుకొస్తోంది. భావావేశంతో చలించిపోతూ అమాంతం స్వామివారి పవిత్ర పాదాలమీద వాలిపోయాడు.

"కెవ్వు"మని అరిచి మగత నిద్రలోంచి లేచి కూర్చుని ఏదో బాధతో విలవిల్లాడిపోతున్నారు స్వామివారు.

కుర్రవాడు రెండు అంగల్లో అక్కడికి దూకి, "స్వామివారి పాదాలు పుండ్లుపడ్డాయి. అసలే షుగరు. అందుకే అవి ఎన్ని వైద్యాలు చేసినా మానటంలేదు. దయచేసి ఇంకెప్పుడూ అలా వారి పాదాలమీద పడకండి!" అన్నాడు వినయంగానే.

స్వామివారి ముఖంలో విషాదం తొంగి చూసింది.

"స్వామీజీ! నన్ను క్షమించండి. మీ పవిత్ర పాదాలను తాకి పునీతమవుదామన్న ఆత్రుతలో విచక్షణ మరిచి ప్రవర్తించాను. మీ స్థూల శరీరానికి బాధ కలిగించాను!" అన్నాడు రామ్మూర్తి మనస్తాపం చెందుతూ.

"అంతా ఈశ్వరేచ్ఛ!" అని పలకమీద రాశారు స్వామీజీ.

"తమరి దర్శనం ఇంత తేలికగా లభించటం నా పూర్వజన్మ సుకృతం!"

"అంతా ఈశ్వరేచ్ఛ!"

"అమావాస్య, ఆదివారం మా మనుమడు పుట్టాడు. తేదీ ...."

"అంతా ఈశ్వరేచ్ఛ!"

"మా అమ్మాయి సువర్చల కంప్యూటరు కోర్సు చదువుతోంది ...."

"అంతా ఈశ్వరేచ్ఛ!" అని పలకంతా అక్షరాలతో నిండిందని గ్రహించినవారై ఉమ్మితో పలకను 'కట్టించి', కావివస్త్రంతో శుద్ధిచేసి పక్కనే పెట్టుకుని కూర్చున్నారు స్వామీజీ.

తన ప్రశ్నలకు స్వామివారలా అనంతానంత జ్ఞానపరమైన లోతు సమాధానాలు చెప్పడంతో ఎంతో సంతుష్టుడైన రామ్మూర్తి మెరుపు కళ్లతో చూస్తూ "రాజీ! స్వామివారిని నువ్వేదైనా అడిగితే అడుగు!" అన్నాడు.

'అడుగమ్మా .... పర్లేదు!' అని పలకమీద రాశారు స్వామీజీ.

"మీ మౌనవ్రతానికి ఇందాకనే భంగం వాటిల్లింది కదా, స్వామీజీ! ఇంకా ఎందుకు ఈ మౌనవ్రతం?" అంది రాజ్యలక్ష్మి.

'భంగమా? లేదే ....!' అని రాసి ఆశ్చర్యంగా చూశారు స్వామీజీ.

"రామ్మూర్తిగారు మీ పాదాలమీద వాలినప్పుడు మీరు 'కెవ్వు'మని నోటితో అరిచారు కానీ, పలకమీద రాయలేదు కదా?" అని అడిగింది రాజ్యలక్ష్మి.

'అంతా ఈశ్వరేచ్ఛ!' అని పలకమీద రాసి, బలపాన్ని తుంచి రెండు ముక్కలు చేశారు స్వామీజీ. ఒక బలపం ముక్కను చూపించి, నోటితోనే కొంచెం ఇబ్బందిగా మాట్లాడటం ప్రారంభించారు.

"అమ్మా .... నీ పేరేమిటో?"

"రాజ్యలక్ష్మి అంటారు, స్వామీ!"

"చూడమ్మా, రాజ్యలక్ష్మీ! ఈ ముక్క స్థూల శరీరం అనుకో! రెండవ ముక్క సూక్ష్మ శరీరం అనుకో. రెండు కలిసి ఉన్నప్పుడే బలపం చేతికి అంది రాసేందుకు వీలైనట్టు భౌతిక శరీరం ఆరోగ్యంగా ఉండి ఉంటేనే సూక్ష్మశరీరం కూడా అంటిపెట్టుకుని ఉండి జీవన వ్యాపారానికి దోహదం చేస్తుంది. వయసు ఉడిగి స్థూలశరీరం శిథిలమైపోగానే, సూక్ష్మశరీరం అనబడే జీవుడు కూడా దగా చేసి వెళ్లిపోతాడు ..." అన్నారు స్వామీజీ.

వారికి ఇంకా ఏదో చెప్పాలన్న తపన. శరీరం సహకరించటంలేదు. భావాలు బయటకు తంతూ, ఆవేశంతో కంపిస్తూ ...

"అనవసరంగా మీ మనసును కష్టపెట్టి ఉంటే క్షమించండి!" అంది రాజ్యలక్ష్మి.

అది కాదన్నట్టు చేత్తో సైగ చేశారు స్వామీజీ. కొంచెం అలుపు తీర్చుకుని, "నేను ఆరోగ్యంగా ఉన్నప్పుడు ఆశ్రమానికి వచ్చేవాళ్లంతా నా కోసం వస్తున్నారని అహంతో ఉబ్బిపోయాను. ఈ ఆస్పత్రి మంచం, శిథిల దేహం నాకు జ్ఞానం బోధించాయి, అంతా నా భ్రమ అని! వాళ్లంతా వాళ్లకోసం వచ్చేవారు కానీ, నాకోసం కాదు. నేను కూడా ఆశ్రమాన్ని స్థాపించి కఠోర పరిశ్రమతో జీవితాన్ని కాల్చుకుని, ఎన్నో ఆనందాలకు దూరమైంది నా కోసమే కానీ ఎవరికోసమూ కాదు. భగవదారాధనలో, సత్యాన్వేషణలో సత్ఫలితం పొంది, కాలం కూడా హరించలేని శాశ్వతశాంతిలో కుదురుకుందామన్న నా అత్యాశే నిజజీవితానికి నన్ను దూరం చేసింది. ప్రకృతి సిద్ధమైన తలపులను కూడా బలవంతంగా గొంతు నొక్కి, కాపట్యంతో కాలాన్ని మింగుతూ కైవల్య ప్రాప్తికోసం 'కట్టె'ను హింసించిన వాణ్ని నేను!" అన్నారు స్వామీజీ.

"మీదీ ఒంటరి వేదనేనా?" అడిగాడు రామ్మూర్తి.

స్వామీజీ ముఖంమీద విషాదం తుళ్లింది. అంతలోనే నిగ్రహించుకుని "రేపు సాయంత్రం మీరొకసారి శ్రమగా భావించకుండా రండి!" అన్నారు.

"తప్పకుండా వస్తాం! కానీ ఆసక్తి వల్ల అడుగుతున్నాం, స్వామీజీ! ఎందుకు రమ్మన్నారో చెప్తారా?"

"విప్లవకారుడు ధర్మన్న పేరు విన్నారా?" అడిగారు స్వామీజీ.

"విన్నాం."

"చాలాకాలంగా అజ్ఞాతంలో ఉంటూ సాయుధ పోరాటంతో ప్రభుత్వాన్ని గడగడలాడించిన వ్యక్తి. వృద్ధాప్యంలోకి వచ్చారు. పోలీసులకు పట్టుబడ్డారు. వారిని వైద్యం కోసం ఇక్కడికి రేపు తెస్తారు. ఏ వైఫల్యం మన అందరికీ ఆవేదన అందిస్తోందో ఆ వైఫల్యాలకు ధర్మన్నగారు చెప్పే పరిష్కారం ఎలా ఉంటుందో విందాం. విప్లవ దృక్కోణంలో అయినా పరిష్కారం దొరికితే నాకూ కొంత ఊరటే. వస్తారు కదూ?" అని అడిగారు స్వామీజీ; ఎక్కడో అగాధాల్లోకి తొంగి చూస్తున్నట్టు చూస్తూ.

అంగీకారంగా తలలు ఊపి, ఇద్దరూ స్వామీజీకి నమస్కరించారు. కదిలి జనరల్ వార్డులోకి తిరిగి వెళ్లిపోయారు.

ఆస్పత్రి సిబ్బంది స్ట్రెచర్‌మీద అప్పుడే సుబ్బారావుగారిని తెచ్చి మంచం మీద పరుండబెట్టి వెళ్లిపోయారు. మంచం దగ్గర పడుచు భార్య ఉంది. పక్కింటి పరంధామయ్యా ఉన్నాడు.

ఇద్దరూ సుబ్బారావు దగ్గరికి వెళ్లారు. ఆయన స్పృహలోనే ఉన్నారు.

"ఎలా ఉంది?" అడిగాడు రామ్మూర్తి.

శిథిలమైన దేహంలోంచి కాంతి అంతా గడ్డకట్టి తేలినట్టే నవ్వేరాయన. "అంతా కక్కించారుగా .... దాంతోపాటు నా అజ్ఞానం కూడా బయటకు వెళ్లిపోయింది. ఒంటరి వేదన నుంచి విముక్తం కావాలన్న స్వార్థంలో ఆమెకు తాళి కట్టాను. అన్నీ సమకూర్చాను కానీ వయోరీత్యా దాంపత్యసుఖం మాత్రం ఇవ్వలేకపోయాను. ప్రత్తిలో నిప్పు దాచినట్టు ఆమె కోర్కెను చాలాకాలం గుండెలోనే దాచుకుంది. అది దహిస్తుంటే తట్టుకోలేక పరంధామయ్యకు చేరువైంది. ఆ వాస్తవాన్ని జీర్ణించుకోలేకపోయాను. నా వైఫల్యాన్ని అహంతో, నీతి సూత్రాల కాపట్యంతో కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశాను. అంతర్మథనంతో వేగిపోతూ ఆత్మహత్యకు పాల్పడ్డాను. చావలేదు. యమపాశం కూడా మరో అవకాశం నాకు కల్పించింది నన్ను నేను సంస్కరించుకునేందుకు. కాపట్యాన్ని కడిగేసుకుని జీవిత సత్యాలను, వాస్తవాలనూ గ్రహించి స్వీకరించమని!" అంటూ సుబ్బారావుగారు ప్రశాంతంగా కళ్లు మూసుకుని మగతగా పడుకున్నారు.

మాటల అలల్లా ధ్వనించిన వేదనాతరంగాలు ఆగి, నిశ్శబ్దం పరుచుకుంది అక్కడ. మౌనరాగాలేవో వినిపిస్తున్నాయి - షెహనాయి గాయాలు కెలుకుతూ.

తన మనసే శరీరానికి చాలావరకు వైద్యం చేసుకున్నట్టు తోచింది రామ్మూర్తికి. మనసు, శరీరం తేలికై దూదిపింజలా గాలిలో తేలిపోతున్నట్టు ....

సుబ్బారావుగారి వైపు చూశాడు రామ్మూర్తి. ఇప్పుడు వారి ముఖం మబ్బు తుడిచిన చందమామలా ఉంది.

***

సుబ్బారావు త్వరత్వరగా కోలుకుంటున్నాడు. మరో రెండు రోజుల్లో ఇంటికి వెళ్లవచ్చునని చెప్పారు డాక్టర్లు. భార్య, పరంధామయ్య అతడికి సేవలు చేస్తూ అంటిపెట్టుకుని ఉంటున్నారు.

డ్యూటీ డాక్టరు వచ్చి రోగులను పరీక్ష చేసి వెళ్లగానే యథావిధిగా వేణు మంచంమీంచి లేచి వరండాగుండా నడిచి వెళ్లి పారదర్శకమై, ప్రకృతి అందాలను స్పష్టంగా లోపలికి చూపుతున్న గ్లాస్ డోర్స్ దగ్గర నిల్చున్నాడు; బయటకు చూస్తూ.

ఇంకా వేణు ఎంతకాలం ఆస్పత్రిలో ఉండాలో స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. రకరకాల పరీక్షలు చేసి రోగాలన్నింటికీ మందులు వాడుతున్నారు.

అతడి మనసంతా కంగాళీగా ఉంది. ఏదో భయం, ఆందోళనతో కలవరపడుతూ, స్పష్టాస్పష్టమైన వ్యథలో క్రుంగిపోతూ ... హృదయంలో ఏదో హోరు! గాఢంగా నిట్టూర్చాడు.

సువిశాలమైన ఆవరణలో ఉంది ఆసుపత్రి. చుట్టూ వృత్తాకారంలో బలమైన ప్రహరీ గోడ; ఆ గోడకూ ఆస్పత్రి భవనాలకూ మధ్య గుమ్మటాల్లా పెరిగిన పచ్చని చెట్లూ, పూ పొదలూ; చెట్లమీది గూళ్లలోంచి పిట్టల కువకువలూ; స్వచ్ఛమైన గాలి, వెలుతురూ ....

వాతావరణం బయట ఎంతో బాగుంది.

ఇరుకు గహ్వరంలా ఉన్న ఆస్పత్రి గదిలో రోగాల చిట్టాను మననం చేసుకుంటూ, గుప్పెళ్లకు గుప్పెళ్లు మందులు మింగుతూ, ఇంజక్షన్లు పొడిపించుకుంటూ కలకాలం బతకాలన్న ఆశతోనూ, చావు భయంతోనూ ...

'ప్రకృతిలోకి పారిపోదామా? ఈ ఇరుకు గహ్వరాన్ని విడిచి వెళ్దామా?' అడిగింది మనసు.

పేలవమైన నవ్వు ఏదో వేణు పెదాల మధ్య చిట్లింది.

'పిచ్చి మనసా! నన్ను అంటిపెట్టుకుని నాతోపాటు ఇరుకు గహ్వరంలో ఉండలేక ఆనందాన్ని వెదుక్కుంటూ వెళ్దామని నువ్వే ఆత్రుత పడుతుంటే, ఇన్నేసి కల్మషాలతో, రుగ్మతలతో, రోగాలతో, వృద్ధాప్యపు శిథిలదేహమైన ఈ ఇరుకు గహ్వరంలో జీవుడు కూడా ఆనందాలను వెదుక్కుంటూ బయటకు వెళ్లిపోతే దగా ఏముంది?'

గాఢంగా నిట్టూర్చాడు వేణు. నొసటిమీద అరిచేత్తో బలంగా నొక్కుకున్నాడు. ఏదో రిలీఫ్! స్వల్పమైన ఆ క్రియకే వెదడును పేల్చివేసేంతగా ఉధృతంగా పొంగిన భావోద్వేగం, బాధ, టెన్షన్....! ఎంచక్కా క్షణంలోనే సాంద్రత కోల్పోయి ఉపశమించాయో!

ఆసుపత్రి భవనం తూర్పువేపున ఉన్న ఎత్తయిన ఆ గుట్ట వేపే

చూస్తున్నాడు వేణు.

. పచ్చికతో నిండిన ఆ గుట్టమీద బల్లపరుపు ప్రదేశం దాని మధ్య శిలువ ఆకారంలో కనిపించే రెండు వెదురు కర్రలూ ... గడ్డిపరకలు నములుస్తూ తమకంలో తేలిపోతున్న తల్లి లేని లేగదూడా .... దానిని అపురూపంగా పెంచుకుంటున్న ముసలి అవ్వా ....

ఆ గుట్టవైపు అద్దాల్లోంచి చూస్తూ నిల్చుంటే మనసుకు ఏదో అనిర్వచనీయమైన ఆనందం కలుగుతోంది.

ఒకసారి "ఆ అవ్వ ఎవరు? గుట్టమీద ఆ శిలువ ఏమిటి? పగలంతా లేగదూడకు కావలి కాస్తూ గడ్డి పరకలు మేపి మునిమాపు వేళకు అదృశ్యమయ్యే అవ్వ ఎక్కడ ఉంటుంది, ఎక్కడ తింటుంది?" అని అడిగితే, వార్డుబోయ్ చెప్పాడు కదా ...

- బ్లడీ డిస్టబెన్స్!


"వేణుగారంటే మీరే కదూ?" అని అద్దాల దగ్గరికి వచ్చి అడిగారు ఎవరో.

"అవునండీ .... ఏం కావాలి మీకు?" అంటూ పరీక్షగా అతడ్ని చూశాడు వేణు.

అతడిది అందమైన విగ్రహం. అరవై ఏండ్లకు పైబడిన వయసే అయినా ఇంకా చాలా ఆరోగ్యంగా ఉన్నాడు. జీవనసంధ్య గుర్తులుగా ముఖంలో కనిపించే భయం, ఆందోళన, బెరుకూ మచ్చుకు కూడా కనిపించటంలేదు.

అతడ్ని నాలుగైదుసార్లు ఆసుపత్రిలో చూశాడు వేణు. ఉదయం, సాయంత్రం రావటం, రోగులను పరామర్శించి వెళ్లటం .... వేణు అతను వచ్చే వేళల్లో అద్దాల దగ్గర నిలబడి ఉండటంతో అతను వేణును ఇంతవరకూ పల్కరించలేదు కానీ, ఇప్పుడు ప్రత్యేకించి వెదుక్కుంటూ వచ్చి అలా పలకరించాడు.

అతని ముఖమంతా నవ్వులతో వెలిగిస్తూ తనను తాను పరిచయం చేసుకున్నాడు. "నన్ను మూర్తి అంటారండీ! ఆస్పత్రిలో చాలామంది 'ఉత్తరాల మూర్తి' అని కూడా పిలుస్తారు. గతంలో రైల్వే ఉద్యోగిని. రిటైరయ్యాను. ఏదో ఒకటి చేసి ఇంకా డబ్బు సంపాదించటం విసుగనిపించింది. అలాగని ఏ వ్యాపకమూ లేకుండా ఖాళీగా కూర్చుంటే మెదడు రాక్షసుల కర్మాగారమవుతుంది కదండీ! దాంతో అర్థంలేని ఏవేవో ఆలోచనలూ .... స్వయంకృతంగా దిగులులోకి కూరుకుని పోవటాలూ .... అందుకే ఆలోచించి రోజూ ఇలా ఆస్పత్రికి వచ్చి, రోగులను అడిగి అవసరమైన వారికి ఉత్తరాలు రాసిపెడుతున్నాను, వారి బంధువులకో, స్నేహితులకో..."



"ప్రజా సేవా?" అడిగాడు వేణు అదోలా చూస్తూ.

"అలా కూడా అంటారేమో నాకు తెలియదు కానీ, నేను చేస్తోంది మాత్రం ఉబుసుపోక! నన్ను నేను బిజీగా ఉంచుకునేందుకు!"

"నా దగ్గరికి ఎందుకు వచ్చారు?"

"మీకూ అవసరమైతే ఉత్తరం రాసిపెడతాను!"

"నేను రిటైర్డ్ ఎస్సైని. చదువు రానివాళ్లకే కదా ... మీ సహాయం అవసరం?"

మూర్తి చాలా తాత్త్వికంగా నవ్వాడు.

"అలా నవ్వుతారేం?"

"మరేమీ లేదు. రోగంతో శరీరం సహకరించనప్పుడు ఎవరూ తమ పనులు తాము చేసుకోలేరు. ఎవరో ఒకరిమీద ఆధారపడవలసిందే. నా వ్యాపకానికి ఇలా ఆస్పత్రినే ఎందుకు ఎంచుకున్నానంటారా, రోగాలకు, వృద్ధాప్యానికి చదువుకున్నవాళ్లనీ, చదువురానివాళ్లనీ తేడా ఉండదు కనుక! సరే ... వెళ్లొస్తానండీ!" అని చెప్పి హుందాగా నడుస్తూ వెళ్లిపోయాడు మూర్తి.

వేణు అతని గురించి అంతగా పట్టించుకోలేదు. వెనక్కు తిరిగి, మళ్లీ అద్దాలగుండా బయటకు చూస్తూ నిలుచున్నాడు.

రామ్మూర్తీ, రాజ్యలక్ష్మి వచ్చారు. "బాగున్నారా వేణుగారూ?" అంటూ పలకరించారు.

"మీరిలా వచ్చి ఆ గుట్టవేపు చూడండి!" అని పిలిచాడు వాళ్లను వేణు.

ఇద్దరూ కొంచెం ముందుకు వెళ్లారు. అద్దాల్లోగుండా చూశారు. వేణు చెప్పాడు వాళ్లకు, అప్పుడు వార్డుబోయ్ చెప్పింది మననం చేసుకుంటూ "ఆ గుట్టమీద తపస్సమాధిలో కూరుకున్నట్టు నిర్వికారంగా కనిపించే ఆ ముసలి అవ్వను చూశారా? ఇక్కడికి కొంచెం దూరంలో ఉన్న ఒక నిర్జన ప్రదేశం ఆమె నివాసం. పర్ణశాలవంటి పూరి గుడిసె ఆమె గూడు. చదువు రాదు. నాగరికత తెలియదు. భర్త చాలాకాల క్రితమే కాలం చేశాడు. బిడ్డలు రెక్కలు వచ్చిన పక్షుల్లా ఎగిరిపోయారు. ఒంటరిదైపోయింది. ఏం వండుకుంటుందో? ఏం తింటుందో గానీ రోజూ పొద్దున్నే తల్లి లేని ఆ లేగదూడను తోలుకుని గుట్టమీదకి వెళ్తుంది. అక్కడ పాతిన శిలువవంటి



## ఈ శతాబ్దపు కొనిస్ప నోటు!

అమెరికా ఇటీవల సిల్వర్ డాలర్‌ని విడుదల చేసింది. అయితే అది నాణెం కాదు. వంద డాలర్ల నోటుకి వెండితో చేసిన ప్రతిరూపం. కాగితం బదులు వెండిని దాని తయారీకి ఉపయోగించారు. అయితే ఇది సేకరణదారులకోసం తప్ప చలామణికోసం కాదు. ఈ అద్వితీయమైన, వందశాతం ప్యూర్ వెండినోటు నిడివి 30 చదరపు అంగుళాలకి పైనే. దాని బరువు 4 ఔన్సులుకన్నా కొద్దిగా ఎక్కువ(124.41 గ్రాములు). 1999లో విడుదలైన దీన్ని 'నోట్ ఆఫ్ ది సెంచురి'గా కీర్తిస్తున్నారు. ఈ నోటుని మైనపు సంచిలో పాక్‌చేసి అమ్ముతున్నారు. వాషింగ్‌టన్ మింట్‌లో దీన్ని ముద్రించారు.

-డి. పద్మజ

వెదురు కర్రలకు ఆహారం తెచ్చుకున్న జోలెను తగిలించి, చెట్టుకింద కూర్చుంటుంది.

"ఆ లేగ దూడకు తల్లి లేదని చెప్పానుకదా ... కరుణామయి అయిన అవ్వే దానికి తల్లి! మంచు బిందువులు ఇంకి నవనవలాడే లేత గడ్డిపరకలను అవ్వే ఎంచుకుని త్రుంచి ఒక్కోసారి దూడ నోటికి అందిస్తుంది. దాని మెడను అల్లుకుపోయి ఆనందంగా ముద్దాడుతుంది. జోలెలో తెచ్చుకున్న ఆహారం ఎప్పుడు తింటుందో, ఎక్కడ నీళ్లు తాగుతుందో కూడా తెలియదు. గడ్డిపరకలతో దూడ కడుపు నిండేకొద్దీ ఆమె కడుపూ నిండుతుందేమో! అంత వయసులో కూడా అవ్వ లేగదూడతో కలిసి చెంగనాలు తీసే ప్రయత్నం చేస్తూంటుంది. సాధ్యపడక గలగలా నవ్వుతుంది. ఆమె ముఖంలో ఒంటరి వేదన, విషాదం, అలసట కనిపించదు.

"చూశారూ ....! అవ్వ పాతిన కర్రలు ఆ గుట్టమీద ఒంటరి శిలువలా కనిపించటం లేదూ? దృశ్యభ్రమే కావచ్చు! సాయంకాలపు వేళల్లో పొద్దు వాలిపోతోంటే ఆ శిలువ నీడ తూరుపు వేపుగా సాగుతూ చీకట్లు ముదిరేకొద్దీ గుట్టలోనే ఇంకిపోతుంది. అప్పుడు ఎంత బెంగగా ఉంటుందో! అక్కడ గడ్డకట్టే నిశ్శబ్దం ... చీకటీ .... రాత్రివేళల్లో అవ్వ కనిపించదు మరి! దూడా కనిపించదు. ఒంటరి శిలువా కనిపించదు. నాకు చీకటిలో ఎలిబూడిద ముద్దలా లీలామాత్రంగా గుట్ట మాత్రం కనిపిస్తూ ఎందుకో క్షోభ పెడుతూంటుంది!" అని భారంగా తల విదిల్చాడు.

ఎవరో కొరడాతో కొట్టినట్టు ఉలిక్కిపడ్డాడు వేణు. మూర్తి - మూర్తి కళ్లముందు నవ్వుతోంది. మెదడులో అలజడి. కళ్లకు కప్పుకున్న మాయపొరలు విచ్చిపోతూ ... జీవితం కళ్ల ఎదుట ఆవిష్కృతమవుతూ

...

"మేము అలా స్వామీజీ దగ్గరికి వెళ్లొస్తాం!" అన్నాడు రామ్మూర్తి.

రాజ్యలక్ష్మి కూడా బయలుదేరింది. ఇద్దరూ స్వామీజీ దగ్గరకు వెళ్లారు. గది వాకిట్లోంచి లోపలికి తొంగి చూశారు. స్వామీజీకి సేవలు చేసే కుర్రవాడు కనిపించలేదు.

కొంచెంసేపు అలాగే నిలబడి, చివరకు ధైర్యం చేసి లోపలకు వెళ్లారు.

మంచంమీద చాలా నిర్జీవంగా పడుకుని ఉన్నారాయన.

"స్వామీజీ!" పిలిచాడు రామ్మూర్తి.

ఆయన తపస్సమాధి నుంచి అప్పుడే మేల్కొన్నట్లు కళ్లు తెరిచారు. వాళ్లను చూసి నీరసంగా నవ్వారు.

"ఆరోగ్యం ఎలా ఉంది స్వామీజీ?" వినయంగా అడిగింది రాజ్యలక్ష్మి.

స్వామీజీ నెమ్మదిగా లేచి కూర్చున్నారు. వాళ్లనూ కూర్చోమని సైగ చేశారు.

"మీకు సేవలు చేసే వ్యక్తి కనిపించరేం?" స్టూలుమీద కూర్చుంటూ అడిగాడు రామ్మూర్తి.

స్వామీజీ ముఖంలో నీలినీడలు పులుముకున్నాయి. కంపిస్తున్న పెదాల మధ్యనుంచి మంద్రంగా మాటలు వినిపించసాగాయి "అతనా ...? మళ్లీ జీవితంలోకి వెళ్లిపోయాడు!" చెప్పారాయన.

"అంటే ఏమిటి స్వామీజీ?"

"ప్రేమ వైఫల్యం నా దగ్గరికి చేర్చింది. కొంతకాలం శిష్యరికం చేశాడు. భగవత్ప్రసాదితమైన జీవితాన్ని భగవంతుడికే అంకితం చేసి తనువూ, మనసూ పూజా పుష్పాలుగా మార్చి అర్పించాడు. అరిషడ్వర్గాలనూ జయించబోయాడు. నిన్న మీరు వచ్చి వెళ్లిపోయాక ఏం జరిగిందో తెలుసా?" అంటూ వారు ఊపిరి పీల్చుకుని, "అతడి తల్లిదండ్రులు వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చారు. ప్రేమించిన అమ్మాయితో వివాహం చేసేందుకు అంగీకరించి, అతడికి నచ్చచెప్పారు. అతను నన్నూ, ఆశ్రమవాసాన్నీ, కాషాయంబరాలనూ .... అన్నింటినీ విసర్జించి ఆనందంగా వాళ్ల వెంట వెళ్లిపోయాడు!" అని స్వామిజీ అదోలా నవ్వారు.

ఆశ్చర్యంగా చూశాడు రామ్మూర్తి. "సిద్ధాన్నం కాలదన్నుకుని వెళ్లినట్లు దైవసాన్నిధ్యం వదలి సాధారణ ప్రపంచంలోకి వెళ్లిపోయారా అతను?" అన్నాడు వినగూడనిదేదో విన్నట్టు.

స్వామీజీ మౌనంగా తల దించుకున్నారు. కొంచెంసేపటి తర్వాత నెమ్మదిగా దిండువేపు జరిగి, తలగడ కింద నుంచి డైరీ ఒకటి తీసి పేజీలు తిరగవేస్తూ కొంచెంసేపు చూసి విషాదంగా నవ్వుతూ మళ్లీ డైరీని యథాస్థానంలో ఉంచారు.

"ధర్మన్నను పోలీసులు ఆస్పత్రికి తెచ్చారు. గట్టి బందోబస్తుతో పక్క గదిలో ఉంచారు. మీరు వస్తారని ఊహించాను. నాక్కూడా ఆయన్ను కలిసి ఏదో తెలుసుకోవాలని ఉంది. ఇంతకు ముందే పోలీసు అధికారిని కలిశాను. వారు దయతో మనం ధర్మన్నను కలిసేందుకు అనుమతించారు. ఇక మనం వారి దగ్గరకు వెళ్దాం, పదండి!" అని మంచంమీంచి కిందికి దిగారు స్వామీజీ.

రామ్మూర్తి చెయ్యి ఆసరా అందించాడు. మరోపక్క ని[illegible]చ్చిన్న రాజ్యలక్ష్మి భుజంమీద చెయ్యి వేసి స్వామీజీ నెమ్మ[illegible]లోంచి

బయటకు వచ్చారు. పక్కనే ఉన్న మరో గదిలోకి దారితీశారు.

అక్కడ ఉన్న పోలీసులు వాళ్లను అభ్యంతరం పెట్టలేదు. స్వామీజీకి నమస్కరించి గుమ్మంలోంచి అడ్డు తొలగి లోనికి ఆహ్వానించారు.

అలా ముగ్గురూ లోపలికి వెళ్లారు. అక్కడి దృశ్యం చూసి చలించిపోయారు రామ్మూర్తి, రాజ్యలక్ష్మి. స్వామీజీ మాత్రం నిర్వికారంగా చూశారు.

ధర్మన్న కాళ్లకు ఇనుప గొలుసులు బిగించారు. అవి మంచం కాళ్లకు కట్టివేసి ఉన్నాయి. మంచం మీద ఒగుడాకులా కనిపించాడు ధర్మన్న. అతని పరిస్థితి చూస్తుంటే ఇనుప గొలుసులతో అలా కట్టెయ్యటం కాదు, బంధవిముక్తం చేసి వెళ్లిపొమ్మన్నా వెళ్లే స్థితిలో లేడు. ఆ శిథిల శరీరం అతడికి సహకరించదు.

"స్వామీజీ! ఇలాంటి స్థితిలో కూడా ఆ జీవుణ్ని అలా హింసించటం ఏం బాగుంది?" అని అడిగాడు రామ్మూర్తి సహించలేక.

స్వామీజీ తల పంకించారు. "అంతా ఈశ్వరేచ్ఛ నాయనా!" అని ఊరట చెందమని రామ్మూర్తిని కళ్లతోటే ఆదేశించారు.

ధర్మన్న కళ్లు తెరిచాడు. ఎదురుగా కాషాయ వస్త్రాల్లో కనిపించిన స్వామీజీని చూసి అతడి కళ్లు ఆశ్చర్యంతో నిండాయి. "కూర్చోండి!" అన్నాడు నెమ్మదిగా.

అందరూ ధర్మన్న ఎదురుగా కూర్చున్నారు.

"ఇంతకూ ఎవరు మీరంతా? నా కోసం ఎందుకు ఇంత శ్రమపడి వచ్చారు?" అని అడిగాడు ధర్మన్న.

గది బయట పహరా కాస్తున్న పోలీసులు మధ్యమధ్యలో గదిలోకి తొంగి చూస్తున్నారు రహస్యంగా. ఆ విషయం గమనించాడు ధర్మన్న.

"నన్ను కలిసేందుకు పోలీసులు ఎలా అనుమతించారు?" అడిగాడు.

రామ్మూర్తి కల్పించుకుని సమాధానం చెప్పాడు. "ధర్మన్నగారూ! మాకు జీవితాలను గురించి కొన్ని ధర్మసందేహాలు వచ్చి స్వామజీని వివరణ అర్థించాం. బాల్య, కౌమార, యౌవనాల్లో జీవితం మన అధీనంలో ఉన్నట్టే తోచేది. కానీ వృద్ధాప్యంలో మనసూ, దేహం శుష్కించిపోతూ అశాంతి, అలజడి, భయం, దీర్ఘరోగాలూ వెంటాడి వేధిస్తుంటే బింకం సడలిపోతోంది. అంతా అంధకారంగా తోస్తోంది. అందుకు స్వామీజీ కూడా ఆధ్యాత్మిక దృక్కోణంలో కాకుండా విప్లవదృక్కోణంలో అలాంటి మానసిక స్థితికి హేతువునూ, పరిష్కారాన్నీ మిమ్మల్ని అడిగి తెలుసుకుందాం అన్నారు. స్వామీజీ ఆరోగ్యంగా ఉన్నప్పుడు దేశ ప్రముఖులు, అధికారులు అనేక రకాల ఆశలతో ఆశ్రమానికి విచ్చేసేవాళ్లు. స్వామీజీ ఆశీర్వాదం పొందేవాళ్లు. అలాంటిది ఇప్పుడు వారు కూడా వయోసహజమైన రుగ్మతలతో బాధపడుతూ ఒంటరి వేదన పడుతున్నారు. రోగాలూ, రొష్టులూ దేహసంబంధాలే అయినా ఒంటరి వేదనకు కారణమైన మనసును ఎలా నియంత్రించాలి? ఎలా నిగ్రహపెట్టాలి? అన్నదే మీరు మాకు బోధించవలసిన విషయం. అది తెలుసుకునేందుకే స్వామీజీ పలుకుబడితో మేమందరం సులభంగా మిమ్మల్ని కలిసేందుకు అనుమతి పొందగలిగాం!" అని చెప్పాడు రామ్మూర్తి.

ధర్మన్న అందరినీ ఒకసారి దీనంగా చూశాడు. కొద్ది క్షణాల మౌనం తర్వాత స్వామీజీ వైపు చూస్తూ, "అహం బ్రహ్మాస్మి అన్నారు కదా .... ఎవరు అన్నారో చెప్తారా స్వామీజీ?" అడిగాడు, చర్చకు శ్రీకారం చుడుతూ.


"పవిత్ర గ్రంథాల సందేశం అది!" చెప్పారు స్వామీజీ.

"అలా బ్రహ్మం అనదు. భౌతిక ఆకారం అగు 'నేను' కూడా అనదు. అలా అనేది 'నేను' అనే దాన్ని మాయామోహంతో, అహంతో నింపిన 'మాయ నేను' మాత్రమే అంటుంది. మన భావాలన్నింటినీ ఉత్పత్తి చేసేది 'మాయ నేను' మాత్రమే! భావన లేకుండా నియంత్రించుకోగలిగిన స్థితికి ఆధ్యాత్మిక చింతన ఎదిగితే, అనర్థానికి అర్థం తెలియకుండా పోతుంది. భావన ఉన్నంతకాలం భయం తొలగదు కదూ?" అని అడిగాడు ధర్మన్న.

స్వామీజీ మెరుపు కళ్లతో ఆశ్చర్యంగా చూశారు.

"విప్లవ పోరాటంతో ప్రభుత్వాన్ని గడగడలాడించిన మీరేనా, ఇలా అహం బ్రహ్మాస్మి నుంచి భావనల నిర్మూలన దాకా విశ్లేషించి చెప్తోంది?" అని అడిగారు మంద్రస్వరంతో.

"ప్రభుత్వాన్ని గడగడలాడించింది ఈ ధర్మన్న కాదు! బాధ, భయం, వేదన .... అన్నింటికీ కారణం భావన కదా! ప్రభుత్వం తన వైఫల్యాల వలన బలహీనమైన భావనలతో భయానికి లోనవుతూ పడుతున్న భయం మాత్రమే అది!" అని అంత నీరసంలో కూడా పగలబడి నవ్వాడు ధర్మన్న. కాళ్లకు బిగించిన ఇనుప గొలుసులు కదిలి, అవి కూడా నవ్వినట్టే చప్పుడైంది! "స్వామీజీ! జీవి పుట్టుక, గిట్టుక మొదలు చావు తర్వాతి జీవితం గురించి కూడా బోధించే ఆధ్యాత్మిక చింతనతో ఆశ్రమాలలో మహా గ్రంథాలను అధ్యయనం చేస్తుండే మీవంటివారు జీవితాన్ని




**జంబో రెస్టారెంట్**

ఈ ఫొటోలో దీపాలకాంతితో వెలిగిపో      ఈ అందాలభవంతిని చూస్తే ముద్దొస్తోందికదూ    యితే, మీరు ఊహిస్తున్నట్టుగా ఇది భవంతి కాదు. ఇది హాంకాంగ్‌లో నీటిపై హంసలా తేలియాడే జంబో అనే పడవ. దీన్నే ఫ్లోటింగ్ రెస్టారెంట్ అంటారు. ఏకకాలంలో ఇందులో రెండు వేలమంది విందువినోదాలు సాగించవచ్చు.

-యం. ఉదయభాను

గురించి మరొకరిని అడిగి తెలుసుకునే సంకల్పం చేశారంటే అందులో గూఢార్థం ఏదీ లేదు కదా?'' అని ధర్మన్న స్వామీజీ కళ్లల్లోకి సూటిగా చూశాడు.

ధర్మన్న అలా అడిగినందుకు స్వామీజీ చిద్విలాసంగా నవ్వారు.

''సత్యసారం తెలుసుకుందుకు కేవలం శాస్త్రగ్రంథాల పఠనం, ఆశ్రమవాసం చాలవు. ఆధ్యాత్మిక చింతన ఉపరితలంమీది పొరలను మాత్రమే ఛేదించి చూసిన మిడిమిడి జ్ఞానం చాలదు. సత్యాన్ని మరుగుపరిచే ఆలోచనలు మొలకెత్తనంతగా సమాధి కుదరాలి. నిశ్చల సమాధి కావాలి అది. అప్పుడే అహాన్ని వర్జించిన స్ఫూర్తి - అనుభవం నిలకడగా ఉంటుంది. సత్యాన్ని గ్రహిస్తుంది. కానీ, లౌకిక ప్రపంచ ఛత్రఛాయల్లో ఉంటూ, అణువణువునా ఆ ప్రపంచపు కాలుష్యాన్ని అనుభవంలోకీ, కనీసం ఆలోచనల లోనికీ రానివ్వకుండా నిశ్చల సమాధి ఎంతవరకు సాధ్యం?'' అని ఏదో అసంతృప్తిని ముఖంలో వ్యక్తం చేశారు స్వామీజీ.

ధర్మన్న ముఖం వాడిపోతోంది. స్వామీజీ అలా ఏదో సత్యశోధనలో శరీరాన్ని శుష్కింపజేస్తూ ఆత్మానందం పొంది, జీవిత చరమాంకంలో ఆ ఆత్మానందం కూడా సాంద్రత కోల్పోయి ఏదో పోగొట్టుకున్న భావనతో కుమిలిపోతుంటే - తాను విప్లవసాధనలో శరీరాన్ని శుష్కింపచేస్తూ ఆత్మానందం పొందినా జీవితం చరమాంకంలో ఆ ఆత్మానందమే తనను గేలి చేస్తూ చెయ్యిజారిన జీవితపు మగో కోణంలోని, గూడుకట్టుకున్న కాపట్యాన్ని కళ్లకు కట్టి చూపటం లేదూ!?

''ఆత్మజ్ఞానం సాధించకుండా పొందే ఆత్మానందం కనుకనే అది కాలగమనంలో అలా సాంద్రత కోల్పోతుంది. మనకు మనం జీవిత గమనంలో వక్రరేఖలు గీసుకుని, ఆ రేఖలవెంట పరుగెడుతూ కాపట్యంతో బతకటంలో శాశ్వతమైన ఆత్మానందాన్ని ఎలా ఆశించగలం?

'' 'నేను' అను నన్ను గురించి అంతర్మథనం చెందుతున్నా, సంఘం కోసం ముఖాన నవ్వులు పులుముకుని యాంత్రికంగా బతకటంలేదూ?

''విప్లవోద్యమానికి ఆత్మ సమర్పణ చేసుకున్నానని ఇంతకాలం అనుకున్నాను. ఆ భావన నాలోని అహాన్ని మరింతగా పెంచింది. పెరిగిన ఆ అహం భౌతిక శరీరం బలహీనమయ్యేదాకా నన్ను వీడిపోలేదు. దాని మాయలోనే మగ్గాను. అహంకారాన్ని ఆత్మసమర్పణ చెయ్యకుండా దాన్ని నా వ్యక్తిగత ఆస్తిగా నిక్షిప్తం చేసుకుని ఆత్మను మాత్రమే అంకితం చేశాను. అందుకే .... అడుగడుగునా నాలో ఇంతటి కాపట్యం అనివార్యమైంది? జీవిత వాస్తవాలను మెదడు అంగీకరించి ఆచరణలోకి తీసుకోకుండా నిరోధించింది అదే కదూ?''

ధర్మన్న భావోద్వేగం తట్టుకోలేక గాఢంగా నిట్టూర్చాడు. అందరినీ ఒకసారి కలయజూసి ... ''వయోరీత్యా కూడా ఇది నాకు జీవనసంధ్య! ఈ తరుణంలో అయినా నన్ను నేను విశ్లేషించుకుని అహాన్ని ఆత్మకు సమర్పణ చేసి, ఆ ఆత్మను సత్యానికి నివేదించి మీ ముందుంచటంలో నాకూ స్వార్థం ఉంది. గుండె బరువు తీరాలి కదా. నా ఈ శిథిల దేహం నుంచి జీవుడు నిష్క్రమించేందుకు మరి కొంతకాలం పట్టినా, ప్రభుత్వం నా జబ్బులన్నింటినీ నయం చేయించి ఉరి తీస్తుంది!''

అందరూ ఉలిక్కిపడ్డారు.

''ఇందాక అన్నానే .... 'ఆత్మానందం' అని! గాఢనిద్రలో మనకు ఏదీ ఉండదు! అహం, అశాంతి, దుఃఖం ... ఇత్యాదివి. మెలకువ రాగానే అన్నీ ఆవహిస్తాయి. ఒకప్పుడు లేకుండా, ఒకప్పుడు ఉంటూండే వాటిని అసత్యాలుగానే భావించి విస్మరించాలి. అప్పుడు మాత్రమే నిత్యసత్యమైన ఆత్మానందం ప్రకాశిస్తుందని పెద్దలు చెప్పారు.

''నిద్రలో కూడా మనలను అంటిపెట్టుకుని ఉండేది ఒక్క ఆత్మే అయితే, అలా ఉన్న ఆత్మ వల్ల నాకేమిటి ప్రయోజనం? నా దృష్టిలో ఇప్పుడు ఆత్మ అంటే నా భార్య రుక్కమ్మ మాత్రమే!'' అని తల దించుకున్నాడు ధర్మన్న.

''మీ భార్యా? ఆవిడ ఎక్కడున్నారు?'' అడిగాడు రామ్మూర్తి.

''నన్ను కాదని చాలా కాలం క్రితమే వెళ్లిపోయింది!'' చెప్పాడు ధర్మన్న.

''కాదని వెళ్లిన మనిషిపట్ల అంతటి ఆరాధనా?'' అడిగింది రాజ్యలక్ష్మి.

ధర్మన్న పేలవంగా నవ్వాడు. ''వెళ్లింది కనుకనే ఈ ఆరాధన! అప్పుడు నేను దండకారణ్యంలో విప్లవకారులకు తర్ఫీదు ఇస్తూ ఉండేవాడిని. అడవి గర్భంలో రహస్యంగా సాయుధ శిక్షణ జరిగేది. అక్కడికి సమీపంలో ఉన్న ఒక కోయగూడెం నుంచి విప్లవకారులకు రోజూ ఆహారం తెచ్చి ఇచ్చేది రుక్కమ్మ ....'' అంటూ ధర్మన్న కొంచెంసేపు రుక్కమ్మ జ్ఞాపకాల అలలమీద తేలిపోతూ మౌనంగా కూర్చున్నాడు.

ఆ మౌనానికి కూడా ఎవ్వరూ అంతరాయం కలిగించలేదు.

కొంచెంసేపటికి ధర్మన్న మళ్లీ చెప్పటం ప్రారంభించాడు. ''అందంతో, అమాయకత్వంతో ముచ్చటగా ఉండేది రుక్కమ్మ. తొలి పరిచయంలోనే ఆమె ఆకర్షణకు లోనయ్యాను. ఆమె మాకు ఆహారం అందించి తన పని ముగించుకుని వెళ్లినపుడు ఆమె భౌతిక దేహం కళ్లకు కనిపించేది కాదు గానీ, ఆమె నా చెంతనే ఉండేది!

''ఆమె ఆలోచనలతో నిండిన మనసు నన్ను మంత్రించినట్టు ఒక్కోసారి సాయుధ శిక్షణ కూడా సరిగా ఇవ్వలేకపోయేవాణ్ని. నేను గురిచూస్తూ పేల్చిన తూటాలు కూడా ధ్యేయానికి తగలకుండా ఆమె వెళ్లినవేపే దూసుకు వెళ్లేవి. విప్లవానికి అంకితమైన నన్ను అంతగా ప్రేమ ప్రభావితం చేసిందన్న వాస్తవాన్ని అందరిలో అంగీకరించలేకపోయాను. ఆ కోర్కెకు కపటంతో ముసుగు తొడిగి, అడవి సాక్షిగా ఆ అమ్మాయిని వివాహం చేసుకుని, దాన్ని 'ఆదర్శం' అన్నాను.

''రుక్కమ్మకు నిజానికి విప్లవం అంటే తెలియదు. సిద్ధాంతంపట్ల అవగాహన లేదు. ఆమె కూడా నా ఆకర్షణకు లోనైంది. అన్ని అవగాహనలూ ఉన్నాయి అనుకున్న నేనూ అంతే!

''ఇద్దరం భార్యాభర్తలమై అడవిలో ఆడుకుంటూ, సెలయేటి నీళ్లు తాగుతూ, వెన్నెలలో తడుస్తూ, చీకటిలో పెనవేసుకుని ధైర్యం చెప్పుకుంటూ ఆనందం జుర్రుకున్నాం. పోలీసులు వెంటాడుతున్నారన్న వార్తలు అందినప్పుడు మాత్రం మనసు పోలీసు భయంతో నా అజ్ఞాతవాసాన్ని నాకు గుర్తు చేసేది కానీ మరుక్షణమే, రుక్కమ్మవేపు పరుగులు పెట్టేది. అంతా విచిత్రంగా తోచేది నాకు.

''అలా కొంతకాలం గడిచాక 'రుక్కమ్మే జీవితం' అన్న భావన క్రమంగా మాసిపోతూ విప్లవోద్యమం తిరిగి ప్రథమస్థానానికి వచ్చింది మనసులో! పోలీసులు దండకారణ్యాన్ని చుట్టుముట్టారు. విప్లవకారులం దారి చూసుకుని పారిపోతూ - రుక్కమ్మను వెంట రమ్మని అడిగాను!''

''ఏమన్నది?'' ఆత్రుత పట్టలేక అడిగింది రాజ్యలక్ష్మి.

''రాను, అన్నది! ఆమెకు పోలీసులన్నా, కాల్పులు అన్నా అంతులేని భయం. అడవి చెట్ల గూళ్లలోని పక్షుల్లా ప్రశాంత జీవనం కాంక్షించింది. నన్ను కూడా విప్లవోద్యమం నుంచి వైదొలగమని కోరింది. అప్పటికి ఆమెపట్ల నా ఆకర్షణలోని సాంద్రత తగ్గకుండా కొత్తల్లోలా ఉండి ఉంటే ఎలా ఉండేదో కానీ, అప్పుడు నా మనసులో ప్రథమస్థానంలో ఉంది రుక్కమ్మ కాదు ... విప్లవం!

"మేమంతా పోలీసులను తప్పించుకుని పారిపోయాం. రహస్య స్థావరాలు మారుస్తూ విప్లవోద్యమంలో బిజీ అయ్యాను. అడపా దడపా మాత్రమే గుర్తుకు వచ్చేది రుక్కమ్మ. ఆమెను కలిసేందుకు రహస్యంగా గూడానికి వెళ్లాను. అప్పటికే వాళ్లు ఆ గూడెం విడిచిపెట్టి ఎక్కడికో వెళ్లిపోయారు!" అని చెప్పాడు ధర్మన్న.

"ఇంకా ఆమె జ్ఞాపకాలు మిమ్మల్ని విడిచిపెట్టకపోవటం ఆశ్చర్యంగా ఉంది!" అంది రాజ్యలక్ష్మి.

"వయసు, శరీర దారుఢ్యం ఉండి, ఉద్యమంలో బిజీగా ఉన్నంతకాలం అంతగా ఆమె జ్ఞాపకాలు నన్ను వేధించలేదు కానీ, చరమాంకంలో మాత్రం పట్టి పీడుస్తున్నాయి. ఒంటరితనం, ఆవేదన, బాధ, భయం ఒక్కసారిగా ముట్టడించి గుండెలో నిక్షిప్తమైన ఆమె జ్ఞాపకాలను తవ్వి వెలికి తీశాయేమో ఇప్పుడు!" అన్నాడు ధర్మన్న శూన్యంలోకి చూస్తూ.

అక్కడ మళ్లీ నిశ్శబ్దం పరుచుకుంది.

"స్వామీజీ! ఆర్థిక, సాంఘిక, రాజకీయాల కోణం నుంచి మాత్రమే ఆలోచించేది విప్లవోద్యమం. ఇంకా జీవితానికి చాలా కోణాలు ఉన్నాయి పరిశీలించేందుకు!" అని ధర్మన్న స్వామీజీ కళ్లలోకి చూస్తూ, "ఈ వెలితి, ఒంటరితనం, జీవితం చెయ్యిజారిపోయిందా? అన్న భావన, ఆందోళన, మృత్యుభయం ఇలా చరమాంకంలోనే అమితంగా ఆవేదన పెట్టడం వెనుక గల కారణాలను మీరు ఎలా ఊహించారు?" అని అడిగాడు.

"ఏ ఆనందమూ బయట లేదు. అంతా అంతరంగంలోనే ఉంది. కానీ మనసు ఆనందాన్ని అన్వేషిస్తూ బాహ్యమైన విషయాలవైపే పరుగులు తీస్తుంది. దాన్ని నియంత్రించటమే వైరాగ్యం! ఆ వైరాగ్యం పరిపూర్ణమైనప్పుడే మనసును బాధలు బాధించవు!"

"అంటే?"

"అహంకారం తొలగిపోని వైరాగ్యం కూడా నిష్ప్రయోజనమే! అంటిపెట్టుకున్న కాపట్యం, వాస్తవాలను గ్రహించేందుకు మనసు సంసిద్ధం కాకపోవటం, అది అంతర్మథనం చెందినా బలవంతంగా దాని గొంతు నులిమి లౌకిక భావావేశాలను ఆశ్రయించటం .... అన్నీ ప్రతిబంధకాలే!"

"అలాంటి ప్రతిబంధకాలను అధిగమించే మార్గాన్నే కదా, స్వామీజీ .... తమరు ఎంచుకుంది! ఆశ్రమవాసం, అధ్యయనం, ఆరాధనా - జీవనసంధ్యలో కూడా శాంతిగా బతికేందుకు ఇచ్చిన సందేశం ఏమిటో కొంచెం వివరించి చెప్పరూ?" ఆసక్తిగానే అడిగాడు ధర్మన్న.

స్వామీజీ ఏదో బాధతో కుంచించుకుపోతూ, "నా ఆశ్రమవాసం, ఆరాధనా చరమాంక శాంతికి సందేశం ఇచ్చాయో, లేదో! ఇచ్చినా నేను గ్రహించలేకపోయానో? గ్రహించినా జీర్ణించుకోలేకపోయానో నాకు తెలియదు. నాకు తెలిసినంతవరకూ నేను అశాంతిలో కూరుకుపోతున్నాను. ఆ అశాంతికి కారణం నేనే!" అంటూ స్వామీజీ హఠాత్తుగా లేచి నిల్చున్నారు. ధర్మన్నకు చెప్పకుండానే గిర్రున వెనుదిరిగి గదిలోంచి బయటకు వెళ్లిపోతున్నారు.

ఇందాక చెయ్యి ఆసరా లేకుండా నడవలేకపోయిన స్వామీజీ ఇప్పుడు అలా నడిచి వెళ్లటం ఆశ్చర్యంగా తోచింది రామ్మూర్తికి. హడావుడిగా లేచి తనూ బయటకు వెళ్లాడు. రాజ్యలక్ష్మి కూడా అనుసరించింది.

అప్పటికే స్వామీజీ చాలా వేగంగా నడుస్తూ తమ గదిలోకి వెళ్లి మంచంమీద వాలిపోయారు.

"స్వామీజీ ... అలా ఉన్నారేం?" దగ్గరికి వెళ్లి అడిగాడు రామ్మూర్తి.

దగ్గరకి వచ్చి కూర్చోమని సైగ చేశారాయన.

రామ్మూర్తి వెళ్లి మంచంమీద కూర్చున్నాడు, స్వామీజీ పక్కన.

స్వామీజీ కళ్లల్లో ఎప్పుడూ లేనంతగా అశాంతి! దైన్యం నింపుకున్న ఆ కళ్లు జాలిగా చూస్తున్నాయి. తలగడ వద్ద దాచుకున్న తన డైరీని తీసి రామ్మూర్తికి ఇస్తూ "ఇందులో నాలోని మనిషిని చిత్రించి ఉంచాను! నా అశాంతికి కారణం నేనే అన్నాను కదా ... ఆ కారణాలను చెప్పేందుకు కూడా సాహసించలేని పిరికివాణ్ని. అందుకే డైరీలో రాశాను. ఎటూ దైవసాన్నిధ్యానికి వెళ్లాలి కనుక, ఆరిపోయే దీపపు చివరి వెలుగే డైరీ నీకు ఇచ్చే - కడసారి సాహసం!" అంటూ కళ్లు మూసుకుని మౌనంగా పడుకున్నారు స్వామీజీ.

వేణు హడావుడిగా పరుగెత్తుకుంటూ అక్కడికి వచ్చాడు. ఆయాసంతో రొప్పుతూ ఒక్కొక్క మాటనే గొంతులోంచి తవ్వుతూ "రామ్మూర్తిగారూ! ఆ .... ఆ గుట్టమీది ముసలి అవ్వ ఇప్పుడే చనిపోయింది!" అన్నాడు.

అక్కడ విస్ఫోటనం తర్వాతి చెవులు గళ్లుపడే నిశ్శబ్దం ఆవరించింది!

***

స్వామీజీ డైరీ ...

'నిర్జనమైన ప్రశాంత వాతావరణంలో ఒంటరిగా కూర్చుని శూన్యంలోకి చూస్తూండటం నాకు బాల్యం నుంచి మహా ఇష్టం. అడవుల్లో తిరిగేవాణ్ని. కొండల్లో విహరించేవాణ్ని. చెట్టూ, పుట్టా పరిశీలిస్తూ, నిశ్శబ్దాన్ని ఆనందిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సంచరించేవాణ్ని.

'అడవి ఆరంభంలోని సెలయేటి దాపునే ఉన్న ఆ బూడిద రంగు కొండలంటే ఎందుకో నాకు ప్రేమ. పగటి వేళల్లో చివరికి ఆ కొండల్లో కుదురుకునేవాణ్ని. కొండల్లో కూడా సహజసిద్ధంగా ఏర్పడిన నీటిబుగ్గ. దాని పక్కనే నీడను పరిచే పెద్ద పెద్ద చెట్లు ... అక్కడే నా మకాం!

' 'పశువులను, మేకలను మేపుకుంటూ అక్కడ తిరిగే కుర్రవాళ్లు కొద్దిరోజులు నన్ను పరిశీలనగానూ, మరికొద్ది రోజులు అనుమానంగానూ, చివరికి ఆరాధనగానూ చూస్తూండేవాళ్లు. వాళ్లే ప్రచారం ప్రారంభించారేమో, నేనెవరో దివ్యపురుషుడిననీ, నాకు మహిమలు ఉన్నాయనీ, మౌనంగా కూర్చున్నప్పుడు నా తల చుట్టూ వెలుతురు వలయం ఏదో దివ్యకాంతులు ప్రసరిస్తుందనీ ....'

***

'ఈ రోజు ఎవరో నూతన దంపతులు వచ్చారు. పాలు, పండ్లు, ఆకులు, వక్కలు, పసుపు, కుంకుమ తెచ్చారు. నేను కూర్చున్న బండకు పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టారు. కొబ్బరికాయ కొట్టారు. అగరుబత్తీలు వెలిగించారు. కాళ్లకు మొక్కి "కొడుకు పుట్టేలా దీవించండి స్వామీ!" అని ప్రార్థించారు.

'వాళ్లు నాకు ఆపాదించిన దైవత్వం, మహిమ అంతా అబద్ధం అని చెప్పలేకపోయాను. వాళ్లు నా మీద అంతటి విశ్వాసం చూపటం నాకు గర్వంగా తోచింది. వాళ్లను దీవించి పంపాను.'

***

'పశువుల కాపరి-ఎవరో ఎండ తీవ్రతకు స్పృహ కోల్పోయాడు. అతన్ని మోసుకుని తెచ్చి నా పాదాల దగ్గర వేశారు. కాపాడమని అర్థించారు. ముఖంమీద నీళ్లు చిలకరించాను. ఆకును మడిచి దాంతో అతడి గొంతులో నీళ్లు పోశాను. మౌనంగా కూర్చున్నాను. చెట్టు నీడకు అతడు సేదదీరి లేచి కూర్చున్నాడు. తోటి పశువుల కాపరులందరూ భక్తిభావంతో నా కాళ్లకు నమస్కరించారు. వారించలేదు నేను.'

***

'పక్క ఊరి మునసబుగారి అబ్బాయి ఉద్యోగం కోసం రాత పరీక్ష ఏదో రాసి వచ్చాడు. మునసబుగారు మందీ మార్బలంతో వచ్చి శరణు కోరారు. వారుతెచ్చిన పండ్లనే చేత్తో తాకి, ప్రసాదంగా ఇచ్చాను.

ప్రసాదం మహిమతో కుర్రవాడికి ఉద్యోగం వచ్చిందని వాళ్ల నమ్మకం'

***

'ఎన్నికల సమయంలో శాసనసభకు పోటీలో ఉన్న వ్యక్తి ఒకరు నా దర్శనార్థం వచ్చారు. విజయం వరించేందుకు ఆశీర్వదించమని ప్రార్థించారు. వారి వెంట తరలి వచ్చిన కుబేరులనూ, వారి వాహనాలనూ చూస్తుంటే రాచరికమే ఇంకా అమలులో ఉందనిపించింది. కాకుంటే స్వల్పమైన కొన్ని మార్పులు కనిపించాయి. రథ, గజ, తురగ, కాల్బలాలకు మారుగా మారుతి, అంబాసిడర్, ఫియట్, హోండా ... ఆ కార్లలో దిగిన వందిమాగధులూ; ఆస్థాన మల్లయోధులవంటి వస్తాదులు; విదూషకుల్లాంటి పార్టీ అధినేతలూ; వయసు ఉడిగి కానీ, అవినీతి ఆరోపణలు రుజువై కానీ రాజ్యాధికారం త్యజించి - యువరాజును పట్టాభిషిక్తుణ్ని చేసేందుకు అనువుగా అనుభవం కోసం, వెంట తిప్పుకుంటున్న యువరాజువంటి పోటీదారుని కొడుకూ ...

"విజయం వరించు గాక!" అని ఆశీర్వదించాను. అంతకూ ఆశ చావక మంత్రిని కూడా చెయ్యమని మళ్లీ కోరాడు. అందుకూ సమ్మతించి అభయం ఇచ్చాను. అంతా సానుకూలమే అయింది. వారు ఎన్నికల్లో గెలిచారు. మంత్రి అయ్యారు. దాంతో నా దశ తిరిగింది. బంగారు పంజరంలో బంధితుడినయ్యాను.

'నా చుట్టూ భూమికి గిరిగీసి అధికారులు, ప్రత్యేక ప్రభుత్వ ఉత్తర్వులతో ఆ భూమి నాదే అన్నారు. ప్రహరీ గోడ కట్టారు. మధ్యలో ఆశ్రమం నిర్మించారు. ఆ ఆశ్రమం నా స్వేచ్ఛకు సమాధి అయితే, ఆ గోడ కోర్కెలకు గీసిన గిరిలా తోచింది. అప్రయత్నంగానే నేను ఆశ్రమానికీ, కావి వస్త్రాలకూ పరిమితమయ్యాను. నా వ్యక్తిగతమైన జీవితానికి అలా ఒకవేపు నుంచి దారులు మూసుకుపోతూ మరోవైపు నుంచి దారులు విశాలమై, అనంతంగా భక్తుల రాకపోకలు పెరిగాయి. పలుకుబడి కేంద్రానికీ విస్తరించింది. నేను దేశం మొత్తంలోనే చర్చనీయాంశమూ, ఆరాధ్యమూ అయ్యాను!'

***

'ఉబుసుపోవటంలేదు. అందరు భక్తులు వచ్చి వేధిస్తున్నా ఏదో ఒంటరితనం. నా వ్యక్తిగత జీవితకోణం నుంచి తొంగి చూస్తే సర్వం కోల్పోయి, బేలగా, దీనంగా, నిస్సారంగా తోస్తోంది. గ్రంథపఠనంతో జీవాత్మ, పరమాత్మల అర్థం తెలిసినా, కాపట్యంతో జీవనం సాగిస్తూ జీవాత్మను హింసిస్తుంటే, పరమాత్మ అలా ఎందుకు చూస్తూ ఊరుకున్నాడో తెలియలేదు. అంతా ఈశ్వరేచ్ఛ అయితే, నా కోర్కెల ఉనికికి మూలకారణం ఏమిటో మరి!?'

***

'బలవంతంగా కోర్కెలను నిగ్రహించుకోవటం .... చన్నీళ్ల స్నానాలూ .... సాత్వికాహారం .... మనసును నిగ్రహించుకునే విఫలయత్నంలో భాగాలుగా ఆధ్యాత్మిక చింతన .... గ్రంథపఠనం ....

'సహజంగానే నా భౌతికదేహం సర్వసంపన్నమై దివ్యకాంతులు ప్రసరిస్తోంది. తల చుట్టూ వెలుతురు వలయం! కళ్లు అయస్కాంతాలై ... సుందర వదనం తేజోమయమై జిలుగు వెలుగులు వెదజల్లుతూ ...

'తెల్లని వెన్నెల్లో ఆశ్రమప్రాంగణాన పచార్లు చేస్తుంటే వెన్నెల వేడిగా తోచేది. పిట్టల కువకువలు పులకరింతలు కలిగించేవి. ఆకాశంలో తారలతో ఆడుకునే చంద్రుడు వెక్కిరించినట్టు అనిపించేది. కురిసే వెన్నెల, మెరిసే చుక్కలు, తళుకు చంద్రుడూ, ఆమనీ, హృత్తంత్రులు మీటి దివ్య మన్మథరాగాలు పలికించేవి!

'నా మీద నాకే జాలివేసేది. నిద్రకు దూరమై, కోర్కెల ఉధృతితో కల్లోలభరితమైన మనసు మౌనరోదనలు చేసేది. శరీరం నిస్సహాయంగా కంపించేది.'

***

'అర్ధరాత్రి! అందరూ గాఢనిద్రలో ఉన్నారు. ఆశ్రమంలో ఒక రాత్రి గడిపితే సకల రోగాలూ శాంతిస్తాయని వచ్చిన రోగులు, వారి బంధువులూ; నా సేవలో తరించి జన్మరాహిత్యం పొందాలనీ, తమ సూక్ష్మ శరీరం ఇకపై మరి ఏ భౌతికకాయాన్నో ఆశ్రయించి, పునర్జన్మ ఎత్తకుండా భగవంతుడికి అంకితం కావాలని వచ్చి, ఆశ్రమంలో చేరిన బాధాతప్త జీవులూ ....

'నాకు కంటిమీద కునుకే లేదు. కొద్దిసేపైనా నేను నా వ్యక్తిగత ఆలోచనలకు అనుగుణంగా నా జీవితంలోకి వెళ్లి గడిపి వద్దామనిపించింది. నెమ్మదిగా ఆశ్రమం దాటి బయటకు వచ్చాను. ఎవరో హఠాత్తుగా వచ్చి నా పాదాలను తాకారు. ఆ స్పర్శ పూలస్పర్శలా తోచి తల దించి చూశాను. అందమైన అమ్మాయి!

'కంపిస్తున్న చేతులతో ఆమెను పొదివి పట్టుకుని పైకి లేపాను. నాలో అలజడి ఉధృతమైంది.

"స్వామీజీ! కోరిన పురుషుడి వెంట వెళ్లిపోదామని తయారై భగవత్స్వరూపులైన తమరికి నా మనోవాంఛను మనవి చేసుకుని ఆశీర్వాదం పొంది వెళ్దామని ఇంత రాత్రివేళ వచ్చాను. కరుణామయులైన మీరు మనో నేత్రంతో నా రాకను గమనించి ఎదురువచ్చి ఆశీర్వదించారంటే ఆ పురుషుడితో నా సంగమం దైవానుగ్రహమే! ధన్యురాలను, స్వామీజీ!" అని మళ్లీ ఒకసారి నా పాదాలు స్పృశించి ఆమె హడావుడిగా ప్రియుడి కోసం వెళ్లిపోయింది.

'ఆమె సాహసం నాలో అసూయను పురికొల్పింది. నేనలా సాహసించగలనా? అని అక్కడే నిలబడి కొంచెంసేపు ఆలోచించాను. నాలోని కాపట్యం నిద్రలేచింది. జూలు దులిపింది. 'నేను' అనే నన్ను భయపెట్టి కపటపు 'నన్ను'ను ప్రతిష్ఠించింది.

'అమ్మో! ఆ సమయంలో ఎవరైనా అక్కడ నన్ను చూస్తే? పెద్ద పెద్ద అడుగులు వేస్తూ ఆశ్రమంలోకి వెళ్లాను. తలుపులు బిగించుకుని నా గదిలో పవళించాను నా కంటి తడికి కారణాలు శోధిస్తూ!

***

'నార్త్ అమెరికా ...

'ఆధ్యాత్మిక ప్రపంచ మహాసభలలో సందేశం ఇచ్చేందుకు భారత ప్రభుత్వం తప్పదంటే వెళ్లాను. ఖరీదైన ఏదో హోటల్లో మా బస. సాయంకాలం అలా ఆవరణలోనే పచార్లు కొడుతూ సభలో చెప్పాల్సిన సందేశ వస్తువుని మనసులోనే మథిస్తున్నాను. నాకు తెలియకుండానే స్విమ్మింగ్ పూల్ దగ్గరకు వెళ్లాను.

'ఆడా మగా అన్న భేదం, లజ్జ, బెరుకు, భయం వంటివి ఎంతమాత్రం లేకుండా అందరూ అర్ధనగ్నంగా నీళ్లలో కలిసి ఈదులాడుతున్నారు. తుళ్లుతున్నారు. పరాచకాలు ఆడుకుంటూ ఆనందంగా నవ్వుతున్నారు.

'నీరెండకు మెరుస్తున్న స్త్రీల అర్ధనగ్న శరీరాలను చూస్తూంటే నాలోని అసలు నేను - కాపట్యపు పొరల్లోంచి చివాలున పైకి లేచాడు. కోర్కెలతో వేగిపోతూ - కాపట్యపు 'నేను'ను తిట్టిపోశాడు. మందలించాడు. చీదరించుకున్నాడు. ఆక్రోశించాడు ...

"స్వామీజీ! సభలకు వెళ్లేందుకు వాహనం సిద్ధంగా ఉంది!" అని ఎవరో వచ్చి చెప్పగానే అసలు 'నేను' తిరిగి కాపట్యపు పొరల్లోకి పారిపోయి, కాపట్యపు 'నేను' తల విదిలించుకుని ... వెళ్లిపోయాను.

'ఆధ్యాత్మిక సభలో మనోనాశనాన్ని గురించి విశ్లేషిస్తూ జీవికి

పలురకాల కోర్కెలను ప్రేరేపించి శాంసింపజూసే మనసును నాశనం చెయ్యటమే ఉత్తమమైన మార్గమని బోధించాను. మనసు తనంత తానే నాశనం కాదు కనుక ఆధ్యాత్మిక చింతనతో, కఠోర పరిశ్రమతో జ్ఞాన చక్షువును చైతన్యం చేసి తరచి చూస్తే మనసే ఒక భ్రాంతి తప్ప దానికి ఉనికి లేదని; దాన్ని విస్మరించి ఏకంగా ఆత్మనే వెదకి ఆశ్రయిస్తే ఇక మనసు ఎలాంటి వికారాలనూ కల్పించదన్నాను.

'ఇన్ని అవరోధాలకూ, ఆవేదనేలకూ కారణం జీవుడే కనుక ఆ జీవుడి ఉనికిని ధ్వంసం చేసే మరణం ఒక వరమన్నాను. గాఢనిద్రలో అహం లేని భౌతిక శరీరం ఎలా విశ్రాంతి పొందుతుందో, మరణమనే దీర్ఘనిద్రలో ఆ విశ్రాంతి శాశ్వతమవుతుందన్నాను.

ప్రపంచం నలుమూలల నుంచీ వచ్చిన ప్రతినిధులు నా వాదంతో ఏకీభవించారు. ఆనందంతో కరతాళ ధ్వనులు చేశారు. అభినందనలతో నన్ను ముంచెత్తారు. మళ్లీ విమానం ఎక్కి భద్రంగా తిరిగి వచ్చాను.'

'వృద్ధాప్యం, రోగాలూ సంఘానికీ నాకూ మధ్య అనంతమైన అగాధాన్ని తవ్వాయి. ఒంటరి వేదన తప్ప నాకు మిగిలింది అంటూ ఏదీ లేదు. కోరుకుంటోంది ఇప్పుడు రవ్వంత శాంతి. అది కూడా దక్కలేదు!'

***

"యేమండోయ్!" పిల్చింది దీక్షగా స్వామీజీ ఇచ్చిన జీవితాన్ని చదువుతున్న రామ్మూర్తిని పార్వతమ్మ.

పుస్తకం మడిచి పక్కన పెడుతూ, "ఏమిటీ?" అని అడిగాడు.

"అస్తమానూ ఆ పుస్తకం చదువుతూ కూర్చుంటే ఎలా? అది కూటికి వచ్చేనా, గుడ్డకు వచ్చేనా?" అందావిడ విసుగ్గా.

"విషయం ఏమిటో వివరంగా చెప్పు?"

"మరేమీ లేదు, ఇల్లు అబ్బాయి పేరిట మారిస్తే లోను తీసుకుని మేడ వేయిస్తాడట. కొంచెం ఆ పని చూడండి. దొడ్లో ఉన్న బాదం చెట్టు, వేప చెట్టూ కొట్టించి టేకు చెట్లు నాటిస్తాడట. మనుమడు పెరిగి పెద్దయ్యేనాటికి అవి కూడా పెరిగి బోలెడు డబ్బు వస్తుందని పాపం .... వాడి ఆశ. అలా వెళ్లి చెట్లు కొట్టేందుకు ఎవరైనా కూలీలను పిలుచుకురండి!" అంది పార్వతమ్మ.

రామ్మూర్తి భార్యవైపు ఆశ్చర్యంగా చూస్తూ, "ఆ వేపచెట్టును నువ్వే 'మహాలక్ష్మి' అని పసుపు రాసి, కుంకుమ బొట్టు పెడుతూంటావు. భక్తిగా పూజలూ, ప్రదక్షిణలూ చేస్తూంటావు. అలాంటి మహాలక్ష్మిని నిర్దాక్షిణ్యంగా గొడ్డళ్లతో నరకటం భావ్యమేనా పారూ?" అడిగాడు రామ్మూర్తి.


"అది కాదండీ ... వేప చెట్టయినా, టేకు చెట్టయినా ఆక్రమించేది మన స్థలమే. టేకు చెట్టుకు ఉన్న వ్యాపార విలువలు వేప చెట్టుకు లేవు కదా! అందుకే అది ఆక్రమించిన స్థలాన్ని టేకు చెట్టుకు కేటాయిద్దాం!" అంది పార్వతమ్మ.

"మరి బాదం చెట్టు విషయమో? పూజలు, వ్రతాలు, దైవారాధన, ఆచారాలూ .... వాటిలో ఒక భాగంగానే మారింది కదా .... బాదం ఆకుల విస్తళ్లలో దైవప్రసాదం స్వీకరించటం. అలాంటి బాదం చెట్టును కొట్టేయిస్తే ఆచారానికి అవాంతరం కదూ?"

"ఇంట్లో బోలెడు స్టీలు కంచాలున్నాయి. అంతగా పెద్ద పెద్ద పండుగలకో, శుభకార్యాలకో బాదం ఆకులే కావాలంటే కరణంగారి చెట్టుకు ఎంత పెద్ద ఆకులనీ ..."

విషాదంగా నవ్వాడు రామ్మూర్తి. "అది సరే గానీ .... పారూ! స్వామీజీకి మన బాధలన్నీ విన్నవించి పరిష్కారానికి ఆశీర్వాదం పొందమని పోరకాడింది నువ్వే కదా! వారిచ్చిన పుస్తకం చదువుతుంటే 'కూటికీ గుడ్డకూ వస్తుందా?' అని తిరస్కారంగా అన్నావేమిటి?" అని అడిగాడు.

"మీరే చెప్పారుగా ... స్వామీజీ ఇవాళో, రేపో అన్నట్టుగా ఉన్నారని! అయినా ఇలాంటి పనికిమాలిన చర్చలతో కాలం వెళ్లబుచ్చక అలా వెళ్లి కూలీలను తీసుకురండి!" అంది కాంతమ్మ.



రామ్మూర్తి ఆమెను ఒకపట్టాన విడిచిపెట్టలేదు. "అయితే, పారూ! నువ్వు బాదం చెట్టునూ, వేపచెట్టునూ, స్వామీజీనీ మునుపటంతగా అభిమానించకపోవటం వెనుక పెద్ద లాభాలకోసం స్వల్పలాభాలను విస్మరించటం ఒక కారణం! 'తా నెక్కిన బారని గుఱ్ఱము గ్రక్కున విడువంగ వలయు ...' అన్నది మరో కారణం! అంతేనా?" అని అడిగాడు సూటిగా చూస్తూ.

"అంతే అనుకోండి!" అంటూ విసవిసా వెళ్లిపోయింది పార్వతమ్మ.

"థాంక్స్!" అని చెప్పుల్లో కాళ్లు దూర్చి బయటకు నడిచాడు రామ్మూర్తి.

***

సుబ్బారావును ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అయన భార్య, పక్కింటి పరంధామయ్య కూడా ఆస్పత్రికి వచ్చారు. సుబ్బారావుని వెంటపెట్టుకుని ఇంటికి తీసుకువెళ్లారు.

సుబ్బారావు ముఖం ఇప్పుడు చాలా తేటగా ఉంది. మనిషి చాలా ఆరోగ్యంగా కనిపిస్తున్నాడు. మనసు మంచి కడిగిన మల్లెలా ఉంది. వెనుకటి భయం, ఆందోళన, దుఃఖం, ఆవేదన, ఒంటరితనం ఎక్కడా కనిపించటంలేదు. పడుచు భార్యకు భౌతిక సుఖాల ఆవశ్యకత ఉందనీ, తన వృద్ధాప్యపు శిథిల దేహం, మనసు ఆమె కోర్కెలను తీర్చలేదనీ - వాస్తవాన్ని అతను నిష్కపటంగా అంగీకరించాడు.

అతడి బతుకు తుఫాను తీరం దాటింది!

***

వేణు ఆస్పత్రి నుంచి ఇంటికి రాగానే నిరుపేద విద్యార్థులను పోగుచేశాడు. వాళ్లకు ఉచితంగానే ట్యూషన్లు చెబుతూ తనను తాను బిజీగా మార్చుకున్నాడు.

అతడి మెదడు కర్మాగారం నుంచి రాక్షసులు తొలగిపోయారు. నిష్కపటమైన జీవిత సత్యాలకు మాత్రమే అక్కడ తావు కల్పించాడు. మనసుకూ, భౌతికకాయానికీ కొత్త జవసత్వాలేవో జతగూడినట్టు ఏదో భావన!

అతడి ఆనందానికి కారణం అదేనేమో?

***

సాయంకాలమైంది. పడమటి ఆకాశం జేగురు రంగుకు తిరిగింది. సూర్యుడు అగాధంలోకి జారిపోతున్నాడు. వెలుతురుని మింగేందుకు చీకటి సమాయత్తమవుతోంది.

ధర్మన్న తన గదిలోంచి, స్వామీజీ తన గదిలోంచి ఆస్పత్రి అద్దాలగుండా 'ఒంటరి శిలువ'గుట్టకేసి చూస్తున్నారు.

అవ్వ పాతిన 'శిలువ' తన నీడను తూర్పు వేపు విస్తరిస్తుంటే, ఆకాశంలో వలస పక్షులు యుద్ధవిమానాల్లా దూసుకుపోతున్నాయి. ఆకాశం మలిసంధ్య కాంతితో ప్రకాశిస్తోంది. అది క్షణికం. తిమిరం ఆ వెలుతురును కబళిస్తుంది. మళ్లీ ఉషోదయపు వేళలో వెలుతురు తిమిరాలను పారదోలుతోంది.

ఆ గుట్టమీద అవ్వ లేదు. అవ్వ మిగిల్చిన జ్ఞాపకాలు ఇంకా చెదరిపోకుండా అలాగే ఉన్నాయి.

ఒంటరి శిలువ!

ఒక సత్యాన్ని నిష్కపటంగా స్వీకరించినందుకు - అజ్ఞానం అక్కసుతో పాశవికంగా విజృంభించి, భౌతిక శరీరాన్ని మేకులతో తూట్లు పొడిచి శిలువ వేసిన జీసస్!

అడుగడుగునా కాపట్యం, అజ్ఞానం, ఆశ, పిరికితనం, సత్యభయం ఒక్కొక్క మేకుగా మార్చుకుని, తనకు తానే శిలువలు వేసుకుంటూ, మేకులు కొట్టుకుంటూ ....

రక్తం ఓడే గాయాలతో ఒంటరి వేదన పడుతున్న మనిషి!!

స్వామీజీ, ధర్మన్నల కళ్లు చెమర్చాయి! ఆసుపత్రి అద్దాలగుండా స్పష్టాస్పష్టంగా కనిపిస్తున్న 'అవ్వగుట్ట'మీద లేగ దూడ కనిపించింది. దానికి ఆనందంగా - మంచు ఇంకిన లేత గడ్డిపరకలు త్రుంచి నోటికి అందిస్తూ .... దానితో కలిసి గెంతుతూ .... తుళ్లుతూ .... హాయిగా కబుర్లాడుకుంటూ ... ప్రకృతి అందాలను తిలకిస్తూ ... నిర్భయంగా మలిసంధ్య తిమిరాలకు స్వాగతం పలుకుతూ ...

జీవనసంధ్యలో ఉన్న అతను సరే .... రామ్మూర్తి!

ఆమె రాజ్యలక్ష్మి కదూ?!

(సమాప్తం)



## ఆకాశం అంచే లక్ష్యం..

ఆకాశాన్ని అందుకోడానికి సాహసమే ఊపిరిగా ఉరకలెత్తే ఉత్సాహంతో ఉడుంలా ఎగబాకుతున్న వ్యక్తిని ఈ అసాధారణ ఫొటోలో చూస్తుంటే గుండె ఝల్లు మంటూందికదూ. ఇందులో కనిపిస్తున్న వ్యక్తి ముప్పై సంవత్సరాల సైమన్ కార్టర్...ఆస్ట్రేలియాకు చెందిన ఫొటోగ్రాఫర్. అతని పట్టుదల, కృషి అతన్ని ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఫొటోగ్రాఫర్లలో ఒకనిగా గుర్తింపు పొందేలా చేసింది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అమెరికా, యూరప్ దేశాలలో ఈతని ఫొటోలకు విపరీతమైన డిమాండ్.

యం. ఉదయభాను